Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 12.09.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 15 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# రాజుకుంటున్న రాయలసీమ




- పురుడుపోసుకుంటున్న మరో విభజనవాదం
- రాజధానిపై పక్షపాత నిర్ణయమే కారణం
- విజయవాడలో ఇమడలేమంటున్న సీమ జనం

**రాజధాని ఎంపికలో చంద్రబాబు నియంతృత్వ ధోరణి మరో వేర్పాటువాద ఉద్యమానికి పురుడుపోసింది. విభజన విషయంలో గత యూపిఏ ప్రభుత్వం ఎంత మొండిగా వ్యవహరించిందో, రాజధాని ఎంపికలోనూ చంద్రబాబు అంతే మొండిగా వ్యవహరించారు. పది జిల్లాల ప్రజల మనోభావాలను పట్టించుకోలేదు.**

13జిల్లాలలో విజయవాడ – గుంటూరులతో పాటు వైజాగ్, కాకినాడ, ఏలూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు ల నుండి రాజధాని డిమాండ్లు వినవచ్చాయి. కాని రాష్ట్ర ప్రభుత్వం ఏ పేరును కూడా పరిశీలించలేదు. కనీసం అసెంబ్లీలో చర్చకు కూడా పెట్టలేదు. ఏకపక్షంగా విజయవాడను రాజధానిగా చేశారు. దీనిపై ఉత్తరాంధ్ర నుండి స్వల్పస్థాయిలో నిరసనలు వ్యక్తమయ్యాయి. భవిష్యత్‌లో వీరి నుండి పెద్దగా సమస్యలు ఎదురు కాకపోవచ్చు. కాని రాయలసీమ వాసులు మాత్రం విజయవాడను ఎంపిక చేయడంపై భగభగ మండిపోతున్నారు. రాజధానిగా విజయవాడకు మద్దతు పలికినందుకు వాళ్లు వైకాపా అధినేత వై.యస్. జగన్మోహన్‌రెడ్డిపై కూడా మండిపడుతున్నారు.

కేసీఆర్ ఒకటిన్నర దశాబ్దం పోరాటం చేస్తే తెలంగాణ వచ్చింది. అదే స్ఫూర్తితో గ్రేటర్ రాయలసీమ కొరకు పోరాటం చేయాలనే దిశగా కొందరు రాయలసీమ నాయకులు, మేధావులు సంకల్పిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం కొరకు (మిగతా 10వ పేజీలో)

# స్మగ్లర్లకు టెర్రర్... గూండాలకు హర్రర్

## » ఎస్పీ సెంథిల్‌కుమార్ దడ పుట్టిస్తున్నాడు



**"నీకు కరెక్ట్ ఆఫీసర్ తగిలాడనుకో... ఫ్యాంట్ తడుపుకుంటావు, పోలీసు పవర్ ఏంటో చూస్తావు..." 'పోకిరి' సినిమాలో విలన్ ప్రకాష్‌రాజ్‌తో పోలీస్ ఆఫీసర్‌గా నటించిన షియాజీషిండే చెప్పే డైలాగ్ ఇది. నెల్లూరుజిల్లాకు దాదాపు ఒకటిన్నర దశాబ్దకాలం తర్వాత అలాంటి పోలీస్ ఆఫీసరే వచ్చాడు.**

అరాచకశక్తుల ఫ్యాంట్లు తడిపేలా చేస్తున్నాడు. జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ దెబ్బకు స్మగ్లర్లు, రౌడీలు, గూండాలు ఫ్యాంట్లు ఒక (మిగతా 10వ పేజీలో)

# గొంతు కోస్తా... పాతిపెడతా!



## మీడియాకి 'చండ'శేఖర్ హెచ్చరిక

**నరహంతకుడు నిజాం ప్రభువును నిత్యం కీర్తించే వ్యక్తి, ఈ దేశంలో మేం భాగం కాదన్నట్లు మాట్లాడే వ్యక్తి ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అయితే ఎంత భయం కరంగా ఉంటుందో ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాం. తెలంగాణ సీఎం కేసీఆర్ ఒక ప్రజాస్వామ్య దేశంలో బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రిగా వ్యవహరించడం లేదు. నిజాం నవాబు వారసుడిగా, ఆయన అరాచకాలకు ప్రతినిధిలా వ్యవహ రిస్తున్నాడు. తెలంగాణ ఈ దేశంలో భాగం కాదన్నట్లు, తెలంగాణకు తామే స్వతంత్ర రాజులమైనట్లు, తాము చెప్పిందే అక్కడ జరగాలన్నట్లుగా ఆయన వైఖరి వుంది. దేశంలో ఏ సీఎం కూడా ఇంతవరకు పోనటువంటి నియంతృత్వపు పోకడలను ఆయన అనుసరిస్తున్నాడు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఆయన మాటలు చాలా అతిగా ఉండేవి. తెలంగాణ వచ్చి ఆ రాష్ట్రానికి ఆయన సీఎం అయ్యాక అతని మాటలకు, చేష్టలకు ఒక హద్దు లేకుండా పోయింది.**

ప్రజాస్వామ్యానికి నాలుగోస్థంభం మీడియా. ఈ దేశ రాష్ట్రపతి కూడా మీడియా పట్ల గౌరవంగా వ్యవహరిస్తారు. అలాంటిది కేసీఆర్ మాత్రం మీడియా అంతా తన చెప్పుచేతల్లో ఉండాలని, తాను చెప్పినట్లే (మిగతా 10వ పేజీలో)



# ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు పెద్దపీట

**- నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి**



జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

నెల్లూరుజిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తానని నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. ఆదివారం గూడూరు నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల క్రీడాకారులకు నిర్వహిస్తున్న గ్రిగ్‌మెమోరియల్ పోటీలను చిల్లకూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యంలోనే క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు, వసతి గృహాల్లో క్రీడాసామాగ్రిని అందజేసి గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు జిల్లా పరిషత్ ద్వారా నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించి క్రీడాకారులను వెలికితీసుకురావాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులదేనన్నారు. మొదటిసారిగా గ్రిగ్ మెమోరియల్ పోటీలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు జడ్పీ నిధులను ఛైర్మెన్ రూ.5.50లక్షలను మంజూరు చేయడం హర్షణీయమన్నారు. సర్పంచ్ రామ్మూర్తి, గూడూరు, చిల్లకూరు జడ్పీటీసీలు బొమ్మిరెడ్డి పద్మ, యమునమ్మ, ఎంపిపి రమాదేవి, డిఇఓ ఉష, ఎంఈఓ మధుసూదన్‌రావు, వైయస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఈ తిండి మనుషులు తింటారా?

## గురుకుల పాఠశాల నిర్వాహకులపై ఎమ్మెల్యే ఆగ్రహం



భోజనశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నెల్లూరుజిల్లా నాయుడుపేట మండలం లోని పుదూరు గురుకుల పాఠశాల సిబ్బంది పనితీరుపై సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదివారం ఎమ్మెల్యే పాఠశాలను ఆకస్మి కంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ లోపాలు ఎమ్మెల్యేకు ఆగ్రహాన్ని తెప్పించాయి. భోజనహాలును సందర్శించి, ఆ ప్రాంతం లోపభూయిష్టంగా ఉండడంతో వైస్‌ప్రిన్సిపాల్ సునీతమ్మను ప్రశ్నించారు. నాణ్యతలేని కూరగాయలను పరిశీలించి సిబ్బందిపై మండిపడ్డారు. వంట గదిలో ఒకేచోట గ్యాస్ సిలిండర్లు ఉండటాన్ని తప్పుబట్టారు. స్నానపుగదులు, మరుగుదొడ్లలో కొళాయిలకు ట్యాపులు లేకపోవడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఇకముందు ఇదేవిధంగా కొనసాగితే కఠినంగా వ్యవహరించాల్సి వుంటుందని సిబ్బందిని హెచ్చరించారు.

ఎమ్మెల్యేతో పాటు వైయస్సార్‌సిపి మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు కురుగుండ ధనలక్ష్మి ఉన్నారు.

# ముగిసిన ఎల్ఐసి వారోత్సవాలు



పోటీల్లో విజేతలైన ఎ.ఓ రమేష్‌బాబుకు మెమొంటో అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రక్కన బ్రాంచ్ మేనేజర్ రాముచౌహాన్

గూడూరు సాయినగర్‌లో ఉన్న ఎల్ఐసి కార్యాలయంలో సోమవారం సాయంత్రం వారోత్సవ ముగింపు సమావేశం జరిగింది. ఈ సమావేశా నికి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశాభివృద్ధికి ఎల్ఐసి సేవలు ఎంతో అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ బీమా చేసుకుంటే మంచిదని చెప్పారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ఎల్ఐసి సహాయమందిస్తుందన్నారు. వారంరోజుల్లో జరిగిన ఆటలపోటీల్లో స్కూలు పిల్లలకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, గెలుపొందినవారికి మెమెంటోలు అందజేశారు. వృద్ధాశ్రమానికి రూ.10,000/-ల సరకులు ఎల్ఐసి ఎంప్లాయిస్ కాంట్రిబ్యూషన్ సేకరించి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ రాముచౌహాన్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ పి.ఆంజనేయులు, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఓ.ఆదినారాయణ, ఎన్.శివకుమార్, ఏజంట్లు యూనియన్ అధ్యక్షుడు కె.మునిగిరీష్, ఆఫీసు సిబ్బంది, డీవోలు ఎ.శివసుబ్రహ్మణ్యం, అనిల్‌కుమార్, ఏజంట్లు తదితరులు పాల్గొన్నారు.

# జువ్వలదిన్నెకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి

**కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి**



అమరజీవి పొట్టి శ్రీరాములు జన్మస్థలమైన జువ్వలదిన్నెకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పర్యాటక కేంద్రాల జాబితాలో జువ్వలదిన్నెను చేర్చి అభివృద్ధి చేయా లని ఈనెల 6వతేదీ హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుకు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వినతిపత్రం సమర్పిం చారు. ఇప్పటికే ఇక్కడ ఫిషింగ్ హార్బర్ నిర్మించే విషయమై కసరత్తు జరుగుతున్నందున పర్యాటకంగా కూడా అభివృద్ధి చేయాలని కోరారు.

సింహపురి సమాచారం

## ప్రభుత్వ డ్రైవర్ల సంఘ ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికలు హైదరాబాదులో ఈ నెల 21వ తేదీన సజావుగా నిర్వహిస్తామని ఎన్నికల అధి కారి బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈనెల 6వతేదీ నెల్లూరు రెవెన్యూ అసోసి యేషన్ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయా జిల్లాల అధ్యక్షులుగా ఉండాలని, మూడేళ్ళ నుంచి క్రమం తప్పకుండా సంఘం ఫీజును చెల్లించి ఉండాలన్నారు. డ్రైవర్ల సంఘం ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెల 11న నామి నేషన్ల స్వీకారం, 12న పరిశీలన, అదేరోజు నామినేషన్ల ఉపసంహరణ, 21వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తామన్నారు. రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మధుసూదనరావు, జిల్లా నాయకులు కాయల సతీష్‌కుమార్, షఫీ మాలిక్, ప్రసాద్, సత్యవతి పాల్గొన్నారు.

## పైలెట్ సర్వేకు ఆత్మకూరు మునిసిపాలిటి

ఆరోగ్య, సామాజిక పైలెట్‌సర్వే చేసేందుకు నెల్లూరుజిల్లాలో ఆత్మకూరు మునిసిపాలిటీని ఎంపిక చేసినట్లు నెల్లూరుజిల్లా ముఖ్యప్రణాళిక అధికారి ఉదయభాస్కర్ పేర్కొన్నారు. ఈ నెల 6న ఆత్మకూరు మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్కో జిల్లాలో ఒక్కో మునిసిపాలిటీని పైలెట్ సర్వేకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆత్మకూరు మునిసిపాలిటీలో 23వార్డుల్లో ఆరోగ్య, సామాజిక పైలెట్ సర్వేను ఈ నెల 10వతేదీ లోపు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో గణాంక అధికారి ముక్తేశ్వర రావు, మెప్మా ఏఓ భక్తశేఖర్‌బాబు, అమర్‌నాథ్, శ్రీనివాసులు, శిరీషా, దేవేంద్ర, రఘురామయ్యలు పాల్గొన్నారు.

## టిఎన్ఎస్ఎఫ్ నాయకుడు సస్పెండ్


తెలుగునాడు విద్యార్థి సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి వ్యామల రాజాను సస్పెండ్ చేసినట్లు తెలుగుదేశంపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అనుమతి లేకుండా సభ్యత్వనమోదు చేపట్టడంతో పాటు, పార్టీ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నందున సస్పెండ్ చేశామని, టిఎన్ఎస్ఎఫ్‌తో ఇక అతనికి ఎలాంటి సంబంధం లేదని ఆయన పేర్కొన్నారు.



# గాల్లో రాడార్ కేంద్రం

విమాన సర్వీసుల దశ, దిశను నిర్దేశించే రాడార్ కేంద్రం నిర్మాణం దౌటుగా వున్నట్లు పరిస్థితులను బట్టి తెలుస్తోంది. మూడేళ్ళ క్రితం నెల్లూరుజిల్లాలోని నెల్లూరు - పొదలకూరు మార్గంలో మరుపూరు గ్రామ పంచాయితీ పరిధిలో రాడార్ కేంద్రం నిర్మించేందుకు భారత విమానయాన శాఖ భూములను పరిశీలించి ఈ భూములు అనుకూలంగా వున్నట్లు నిర్ధారించారు. రాడార్ కేంద్రానికి భూముల కేటాయింపులో అసైన్డ్ భూములు కలుస్తున్నందున హైకోర్టులో కేసులు నడుస్తున్నాయి. మరుపూరు రెవెన్యూ గ్రామ పరిధిలో 72ఎకరాలను రాడార్ కేంద్రం కోసం కలెక్టర్ అనుమతితో విమానయాన శాఖకు రెవెన్యూ అధికారులు కేటాయించారు. రాడార్ కేంద్రం ఏర్పాటుకు భూవివాదాలు తొలగిపోయి పనులు ప్రారంభమైతే ఇక్కడ పెద్ద టౌన్‌షిప్ నిర్మాణం జరుగుతుంది. సుమారు 300క్వార్టర్ల నిర్మాణం చేపట్టే అవకాశం వుంది. దీని ఫలితంగా పొదలకూరు ప్రాంతానికి ప్రత్యేకగుర్తింపు లభిస్తుంది. కాని రాడార్ కేంద్రం కోసం కేటా యించిన భూములపై హైకోర్టులో కేసు నడుస్తున్నందువల్ల రాడార్ కేంద్రం ఏర్పాటు సందేహంగానే వున్నట్లు సమాచారం.

# అక్రమరవాణాకు కళ్లెం



లారీల పత్రాలను పరిశీలిస్తున్న డిఎస్ఓ శాంతకుమారి, ఆర్డీవో కె.శ్రీనివాసరావు

ఆదివారం అర్ధరాత్రి మనుబోలు ప్రాంతంలో జాతీయ రహ దారిపై ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో 23బస్తాల బియ్యం, ఒక ఉప్పుడు బియ్యం, 2 ధాన్యం, ఒక పప్పుదినుసుల లారీలను స్వాధీనం చేసుకున్నారు. వారి దగ్గర ఎలాంటి పత్రాలు లేకపోవడంతో లారీలను పట్టుకొని పౌరసర ఫరాల శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. సోమవారం డిఎస్ఓ శాంతకుమారి, గూడూరు ఆర్డీవో కె.శ్రీనివాసరావు, చిల్లకూరు తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్‌నాథ్‌లు సరకు రవాణాకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేనట్లు గుర్తించారు. లారీలను గూడూరుకు తరలించారు. బాధ్యులపై 6ఎ కేసులతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డిఎస్ఓ తెలిపారు. రైస్‌మిల్లర్ల పాత్ర కూడా ఉన్నట్లు తనిఖీల్లో వెల్లడైంద న్నారు. వారిపై కూడా చర్యలు ఉంటాయని తెలిపారు.

# చేనేత రంగాన్ని ఆదుకోవాలి

**• • • • • • • • • పముజుల డిమాండ్**

రాష్ట్రంలో చేనేతకారుల సమస్యలు పరిష్కరించి, చేనేత రంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేతకార్మిక సంఘం గౌర వాధ్యక్షులు పముజుల దశరథరామయ్య డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేనేతకారుల రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పుడా హామీని నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. నేతన్నలు ఎంతో కష్టపడి నేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధరలు లేక ఎంతో ఇబ్బంది పడుతున్నారని, మార్కెటింగ్ సదు పాయాలు కల్పించి, చేనేతకారుల అభ్యున్నతికి వెంటనే చర్యలు తీసుకోవాలని, వారికి పక్కా ఇళ్ళు నిర్మించి ఆదుకోవాలని ఆయన కోరారు. నెల్లూరులో చేనేతబజారు ఏర్పాటుచేసి, చేనేతకారులు వస్త్రవిక్రయాలు జరుపుకునేందుకు ప్రభుత్వం ఉచిత వసతిని కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత కార్మికసంఘం అధ్యక్షులు మోదుగుల పార్థసారథి, ఉపాధ్యక్షులు పన్నెం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో రాజన్న వర్ధంతి



డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి ఫౌండేషన్ వారు అమెరికాలోని ఫిలడల్ఫియాలో వై.యస్. 5వ వర్ధంతిని సెప్టెంబర్6వ తేదీ నిర్వహించారు. దాదాపు 800మంది అమెరికాలోని తెలుగువాళ్ళు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భారతదేశం నుండి వెళ్ళిన మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ళ రామకృష్ణారెడ్డి, గుంటూరు శాసనసభ్యుడు ముస్తాఫా, చిత్తూరు మాజీఎంపి జ్ఞానేంద్రరెడ్డి తదితరులు పాల్గొని వై.యస్.రాజశేఖరరెడ్డికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో పలువురు వై.యస్. అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు ఆళ్ళ రామిరెడ్డి, కోర్ కమిటీ సభ్యుడు గోశాల రాఘవరెడ్డి, రాజేశ్వరరెడ్డిలతో పాటు సంస్థ సభ్యులు పలువురు పాల్గొని రక్తదానం ద్వారా తమ ప్రియతమ నాయకునికి నివాళులర్పించారు.






# గీతాంజలిలో అవగాహన సదస్సు




నెల్లూరు జిల్లా బుచ్చి మండలం గంగవరంలో ఉన్న గీతాంజలి కళాశాలలో ఇటీవల 2014-2015 విద్యా సంవత్సరానికి ప్రథమ ఇంజినీరింగ్, ప్రథమ పాలిటెక్నిక్ తరగతుల ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులకు, తల్లి దండ్రులకు కొత్త సెమినార్ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ జ్ఞాపకశక్తి నిపుణులు జయసింహ విచ్చేసి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో కార్పొరేట్ రంగంలోని సవాళ్ళు అధిగమించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్, కార్యదర్శి ఎన్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అనేక అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డా॥జి.సుబ్బారావు మాట్లాడుతూ తమ విద్యార్థుల నైపుణ్యతలను పెంచడానికి వ్యక్తిత్వ వికాసానికి అనేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి వెంకయ్య, ఆర్అండ్‌డీ విభాగాధిపతి డి.కామేశ్వరి, సియస్ఇ విభాగాధిపతి విజయభాస్కర్‌రెడ్డి, ఇ.ఇ.ఇ. విభాగాధిపతి శ్రీధర్, ఇ.సి.ఇ విభాగాధిపతి పి.రాఘవ రెడ్డి, యస్అండ్‌హెచ్ విభాగాధిపతి కె.విజయ, ప్లేస్‌మెంట్ అధికారి వై.దినకర్, కళాశాల ఇ.ఓ యన్.సుబ్బారెడ్డి, ఏ.ఒ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# పాత ప్యాకేజీలకే కొత్త మేకప్

## - ఏసీ సుబ్బారెడ్డి విమర్శ



రాష్ట్ర పునర్నిర్మాణంలో జిల్లాకు తీరని అన్యాయం జరుగుతోందని, నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వరాలన్నీ అభూత కల్పనలేనని కాంగ్రెస్ పార్టీ నగర ఇన్‌ఛార్జి ఏసి సుబ్బారెడ్డి విమర్శించారు. నెల్లూరులో ఈ నెల 9న ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రాజెక్టులు, పరిశ్రమలనే మళ్ళీ మార్చి చెప్తూ, టిడిపి వారు ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన విమర్శించారు. దుగరాజపట్నం ఓడరేవుకు కాంగ్రెస్ ప్రభుత్వమే అనుమతులు ఇచ్చిందని, కృష్ణ పట్నం ఓడరేవు ఎవరి హయాంలో వచ్చిందో అందరికీ తెలుసునని ఆయన అన్నారు. లెదర్‌పార్క్, టెక్స్‌టైల్ పార్క్ వగైరాలు కూడా కొత్తగా వచ్చినవేమీ కాదని, అయితే వాటిని తామే తీసుకువస్తున్నట్లుగా టిడిపి ప్రచారం చేసుకోవడం విడ్డూరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బర్నాబాస్, హనుమంతరావు, చక్రవర్తి, వినోద్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు నగరంలోని ఇందిరా భవన్ రోడ్డులో నూతనంగా ప్రారంభించబడిన విజయ చిన్న పిల్లల ఆసుపత్రిలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. చెన్నై విజయ హాస్పిటల్ ఎం.డి. డా॥ యం.రాజశేఖర్‌రెడ్డి పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

## విద్యార్థులు

# ఏకాగ్రతతో విద్యనభ్యసించాలి

విద్యార్థులు ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా॥ జి.జగదీశ్వర్ రెడ్డి సూచించారు. సోమవారం నారాయణ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కొత్తగా ఇంజనీరింగ్‌లో చేరిన విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్టు డాక్టర్ వి.సురేష్, ఏ.భాస్కర్ రెడ్డిలు విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, అకడమిక్ ఇన్‌ఛార్జ్ చంద్రమోహన్‌రెడ్డి, మేనేజర్ బి.శ్రీధర్, ప్లేస్‌మెంట్ అధికారి వి.భార్గవరాం, హెచ్ అండ్ ఎస్ విభాగాధిపతి డా॥ కె.సరోజాదేవి, అధ్యాపకేతర సిబ్బంది, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## కలెక్షన్ కింగ్ - డైలాగ్ కింగ్ - నటప్రపూర్ణ

# పద్మశ్రీ మోహన్‌బాబుకి డా॥బెజవాడ గోపాల్‌రెడ్డి అవార్డు

## సెప్టెంబర్ 21న ప్రదానం



ప్రముఖ సినీనటుడు, నిర్మాత, మాజీ రాజ్యసభ సభ్యుడు డా॥ యం.మోహన్‌బాబు డా॥బెజవాడ గోపాల్‌రెడ్డి అవార్డును అందుకోబోతున్నాడు. ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును వివిధ రంగాలలో తమ ప్రతిభ నైపుణ్యాలతో పేరు గడించిన 17మంది ప్రముఖులు ఇప్పటికే అందుకున్నారు. సినీరంగం నుండి చూస్తే ఇప్పటివరకు అక్కినేని నాగేశ్వరరావు, యస్.పి.బాల సుబ్రహ్మణ్యం, మంగళంపల్లి బాల మురళీకృష్ణ, తిక్కవరపు సుబ్బరామిరెడ్డి, మల్లెమాల సుందరరామిరెడ్డి, శ్రీమతి పి.సుశీలలు ఈ అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.

అవార్డు అందుకోనున్న వారిలో మోహన్‌బాబు 18వ వ్యక్తి కాగా, సినిమా రంగం నుండి అందుకుంటున్న వారిలో 7వవాడు. 1974లో సినీరంగప్రవేశం చేసి కన్నవారి కలలు, అల్లూరి సీతారామరాజు వంటి చిత్రాల్లో నటించినా నటుడిగా మోహన్‌బాబుకు జీవితాన్ని ప్రసాదించిన చిత్రం స్వర్గం నరకం. ఈ సినిమా 1975లో విడుదల కాగా దాసరి నారాయణరావు ఈ చిత్రానికి దర్శకత్వం వహించాడు. మోహన్‌బాబు నట జీవితానికి బలమైన పునాది వేసిన 'స్వర్గం నరకం' చిత్రం తరువాత ఆయన వెనుదిరిగి చూడలేదు. 1952 మార్చి 19న చిత్తూరు జిల్లా మోదుగులపాళెంలో భక్తవత్సలనాయుడు జన్మించాడు. విద్యాభ్యాసం పూర్తి చేసిన అనంతరం మద్రాసు వై.ఎ.యం.సి.ఎ కాలేజీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉద్యోగం చేసుకుంటూ సినిమా వేషాల కోసం ప్రయత్నిస్తున్న తరుణంలో 1974లో రెండు సినిమాలలో అవకాశం వచ్చినా పెద్దగా గుర్తింపురాలేదు. 1975లో దాసరి 'స్వర్గం నరకం'తో భక్తవత్సలనాయుడు మోహన్ బాబుగా సినీరంగంలో జన్మనెత్తాడు. ఇప్పటివరకు 520 సినిమాలలో మోహన్‌బాబు నటించగా వాటిలో 146 సినిమాలలో హీరోగా చేశాడు. 1982లో తన స్వంత బ్యానర్ శ్రీలక్ష్మీ ప్రసన్న పిక్చర్స్‌ని స్థాపించి ఇప్పటి వరకు 16 సినిమాలు నిర్మిస్తే అన్నీ సంచలనాత్మక విజయాలు సాధించడం గమనార్హం. సినీనటుడిగా ఎన్నో అవార్డులు ఆయన ఇంట్లో తిష్టవేస్తే 1995లో రాజ్యసభ సభ్యత్వం ఆయనను వరించింది. అటు సినీరంగంలో క్షణం తీరికలేకుండా గడుపుతూనే మరో వైపు వ్యాపార రంగంవైపు దృష్టి మరల్చి 1992లో శ్రీవిద్యానికేతన్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ను స్థాపించి కేజి నుండి పీజి వరకు ఒక ప్రాంగణంలో చదువుకునేలా తిరుపతి సమీపంలోని రంగంపేటలో విద్యాసంస్థను స్థాపించి, దాదాపు 1200మంది బోధన సిబ్బందితో ఏడాదికి 10వేల మంది విద్యార్థిని విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందిస్తున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ బిరుదు భారత ప్రభుత్వం 2007లో మంచు మోహన్‌బాబుకి అందించిందంటే ఒక నటుడిగానే కాకుండా ఇంకా పలు రంగాలలో ఆయన అందించిన సేవలకు ఈ పద్మశ్రీ బిరుదు ప్రదానమే పెద్ద నిదర్శనం.

ఈ ఏడాది కొంత ఆలస్యమైనా డా॥బెజవాడగోపాల్‌రెడ్డి అవార్డుకి సముచిత వ్యక్తిని ఎంపిక చేసింది కమిటీ. సెప్టెంబర్21వ తేదిన నెల్లూరు టౌన్‌హాలులో ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం జరగనున్నట్లు తెలిసింది. ఇంకా అతిథులు అతిరథులు ఖరారు అయినట్లు లేదు. పూర్తి సమాచారం వచ్చే వారం అందిస్తాం.

# గాంధీ జయంతి నుండి నిరంతర వెలుగు

అక్టోబర్ 2వతేది నుంచి 24 గంటలూ విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని డిస్కం సిఎండి హెచ్‌జె దొర తెలిపారు. ఈనెల 9న నెల్లూరులోని విద్యుత్ భవన్లో ఆయన పరిశ్రమల వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. పరిశ్రమలకు ఇకపై విద్యుత్ కోత వుండదన్నారు. వ్యవసాయానికి వెంటనే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోతే 24 గంటల్లోగా కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. అందుకోసం గ్రామీణ ప్రాంత రైతుల నుంచి ఎలాంటి రుసుము తీసుకోకూడదన్నారు. జిల్లాలో పాడైపోయిన విద్యుత్ స్తంభాలను, విద్యుత్ తీగలను వెంటనే సరిచేయాలన్నారు.



ఇటీవల నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో జరిగిన రాధాష్టమి వేడుకల్లో రాధాకృష్ణులకు అభిషేకం నిర్వహిస్తున్న అఖిలభారత యాదవ మహాసభ అధ్యక్షులు దేవరాల సుబ్రహ్మణ్యం, ఆయన సతీమణి, కార్పొరేటర్ మస్తానమ్మ

# 'ప్రభా'తం

ఏ ముహూర్తంలో రాష్ట్రాన్ని విభజించారో కానీ, ఆంధ్రప్రదేశ్‌కు అన్నీ కష్టాలే వచ్చి పడుతున్నాయి. ఏ అభివృద్ధి పనిచేద్దామన్నా నిధులు లేక నీరసపడడం మినహా గత్యంతరం లేని దుస్థితి ఏర్పడింది. అసలే భారీ లోటు బడ్జెట్ ఒకవైపు, చేయాల్సిన అభివృద్ధి పనులు మరోవైపు. ఈ రెండింటికీ మధ్య సమన్వయం కుదరడం లేదు. ఏమి చేయాలన్నా నిధులతో పని. ఆర్థికంగా ఒక రాష్ట్రం ఇన్ని ఇబ్బందులు ఎదుర్కోవడం ఎప్పుడూ వినలేదు.. కనలేదు. ఈ పరిస్థితులన్నిటినీ చూస్తుంటే ఇది ఆంధ్రకు గడ్డుకాలమే అనిపిస్తోంది.

నవ్యాంధ్ర ప్రగతి రథాన్ని ముందుకు కదిలించి రాష్ట్ర సమగ్రాభివృద్ధిని సాధించాలంటే మాటలు కాదు. ఈ అయిదేళ్ళలో కనీసం అక్షరాలా డెబ్భై అయిదు వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని అంచనా. అది కూడా బడ్జెట్ నిధులకు అదనంగా ఇంత ధనం సేకరించాల్సివుంటుంది. ఇంతటి భారీ మొత్తాన్ని సేకరించడం చిన్నవిషయమేమీ కాదు. ఇప్పుడు రాష్ట్రంలో పెద్ద సమస్య ఇదే. ఎవరెంతగా తర్జనభర్జనలు చేసుకుంటున్నా వనరుల సమీకరణ మాత్రం చాలా కష్టంగానే వుంటోంది. ఈ సమస్యలన్నిటినీ అధిగమించి, ప్రగతిరథం ముందుకు కదలాలంటే లక్ష్మీకటాక్షం కావాల్సిందే. ఒకవైపు రాజధాని కూడా లేక బాధలు పడుతున్న రాష్ట్రం, ఇప్పుడు నిధుల లేమితో సతమతమవుతోంది. రాష్ట్రంలో వున్న ఆదాయమార్గాలన్నిటినీ పనిగట్టుకుని వెతకాల్సివుంది.. రాష్ట్రంలోని 13 జిల్లాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాల్సి వుంది. దేశసమగ్రాభివృద్ధిలో భాగంగా కేంద్రం మన రాష్ట్రానికి కూడా తన వంతు సాయం అందిస్తూ, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు కొంత ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, అన్ని అభివృద్ధిపనులకూ కేంద్రమే నిధులు కేటాయించాలంటే అయ్యేపనేనా?..అనిపిస్తోంది. ఈ నేపథ్యంలో, వున్న వనరులను సద్వినియోగం చేసుకోవడమొక్కటే ఏకైక మార్గంగా కనిపిస్తోంది.

అయితే, ఇప్పటికే పడే బాధలు చాలవన్నట్లు.. ఒక కంట కరువు.. ఒక కంట వరద అన్నట్లుగా తయారైంది రాష్ట్రం పరిస్థితి. ఒక వైపు కొన్ని జిల్లాల్లో వానలు లేక, పంటలు పండక రైతన్నలు తీవ్ర ఆవేదనలో వుంటే, మరోవైపు భారీ వానలతో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో వరదలు ముంచెత్తి లోతట్టు ప్రాంతాలు మునకకు గురవుతున్నాయి. అటు కరువును తట్టుకుంటూనే.. ఇటు వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాల్సి రావడం ఒక విచిత్ర పరిస్థితి. మరోవైపు రాష్ట్రంలో నూతన రాజధాని నిర్మాణం విషయంలోనూ ప్రభుత్వం పెద్ద కసరత్తే చేయాల్సివస్తోంది. కొత్త రాజధాని విజయవాడ పరిసరాల్లోనే వుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు కానీ, ఆ మేరకు రాజధాని నిర్మాణానికి అవసరమైన భూసేకరణే పెద్ద సమస్యగా వుంది. తొలివిడతలోనే కనీసం పదివేల ఎకరాల భూములు కావాలి. వాటిని రైతుల నుంచి సేకరించాల్సివుంది. అయితే, రైతులు ఆ మేరకు తమ భూములను ఇచ్చేందుకు అంగీకరిస్తారో..లేదో ఇంకా తేలాల్సివుంది.

ఇదిలావుంటే, కొత్త రాజధాని సింగపూర్‌లా వుండాలని సిఎం భావిస్తున్న నేపథ్యంలో, సింగపూర్ వారి నుంచి సిఎంకు ఆహ్వానం వచ్చింది. సిఎంను తమ దేశానికి రమ్మని సింగపూర్ ప్రతినిధి బృందం ఆహ్వానిస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పనలోనూ, అటు పారిశ్రామికంగా, ఇటు నగరాభివృద్ధి దిశగా ఇవ్వాల్సిన సహకారమంతా తాము ఇస్తామని సింగపూర్ ప్రతినిధి బృందం సిఎంకు చెప్తోంది. ఈ నేపథ్యంలో రాజధాని కోసం సిఎం సింగపూర్ వెళ్ళాలా? లేక ఉభయ గోదావరుల్లో వరద తాకిడికి విలవిలలాడుతున్న ప్రజల కష్టాలు తీర్చాలా?..అన్నీ అత్యవసరమే..దేనినీ కాదనలేని పరిస్థితి. వీటన్నిటికీ మించి రుణమాఫీ పథకం ముఖ్యమంత్రికి మరింత శిరోభారం అవుతోంది. అసలే రాష్ట్రం లోటు బడ్జెట్‌తో వుంటే, ఇంతటి భారీ పథకం ఎలా అమలుచేయాలో అర్థంకాక ప్రభుత్వం సతమతమవుతోంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఈ వేల కోట్ల రూపాయల రుణమాఫీ పథకాన్ని అమలుచేసేందుకు అన్ని మార్గాలనూ అన్వేషిస్తోంది. అయితే, వ్యవసాయ రంగం ఆదాయమే రూ.37వేల కోట్లు వుంటే, రూ. 60 వేల కోట్ల దాకా పంటరుణాలు ఎలా సాధ్యమయ్యాయని రుణమాఫీ కమిటీ తలలు పట్టుకుంటోంది. పంటరుణాల గణాంకాలు తప్పుడు తడకలుగా వున్నాయని, వీటిపై లోతైన అధ్యయనం చేయాలని, రుణాలు తీసుకున్న రైతుల సమగ్ర జాబితాను అందించాలని ఆ కమిటీ బ్యాంకులను కోరే పనిలో వుంది. ఇలా ఏది పట్టుకున్నా అంతా చిక్కులముడిగానే వుండడంతో, ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి సమస్యలు రోజా కోకొల్లలుగానే వస్తున్నాయి. ఈ పెనుసవాళ్లన్నిటినీ అధిగమించి, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించడం అనుకున్నంత సులువేమీ కాదు. ఇప్పుడున్న ఆర్థికలోటును భరాయించి, కొత్త ఆదాయమార్గాల అన్వేషణలో పారదర్శకమైన విధానాలతో.. ఆచరణాత్మకమైన ప్రగతిని సాధించగలగాలి. ఈ గడ్డు కాలాన్ని ఎలాగైనా సరే..అధిగమించగలగాలి. అప్పుడే నవ్యాంధ్ర ప్రగతి బాట పడుతుంది..నవనవోన్మేషంగా సరికొత్త వెలుగులను సంతరించుకుంటుంది. అందుకు ప్రభుత్వం, ముఖ్యమంత్రితో పాటు మేధావులు, అధికారులు అందరూ మరింతగా..నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.




## ఆంధ్రాకు గడ్డుకాలం

ఆర్థికంగా ఒక రాష్ట్రం ఇన్ని ఇబ్బందులు ఎదుర్కోవడం ఎప్పుడూ వినలేదు.. కనలేదు. ఈ కష్టాలన్నిటినీ చూస్తుంటే ఇది ఆంధ్రకు గడ్డు కాలమే అనిపిస్తోంది. నవ్యాంధ్ర ప్రగతి రథాన్ని ముందుకు కదిలించి రాష్ట్ర సమగ్రాభివృద్ధిని సాధించాలంటే మాటలు కాదు. మరింత సమన్వయం, కృషి అవసరం.

# గురువులను గౌరవించుకోవాలి

## - ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి

విద్యను సముపార్జించుకోవడం ద్వారానే సమాజంలో అట్టడుగున వున్న వారు సైతం ఉన్నత స్థానాలను అందుకోగలరని, అలాంటి విద్యను, జ్ఞానాన్ని అందించే గురువులను మనం ఎన్నటికీ గౌరవించుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వై.వెంకటేశ్వర్లు అన్నారు.

ఈ నెల 5న గురుపూజోత్సవం సందర్భంగా నెల్లూరు జడ్పీహాలులో సర్వేపల్లి ఛారిటబుల్ ట్రస్ట్‌వారిచే గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గురువుల వ్యవస్థను మనం పరిరక్షించుకుంటూ, వారిని గౌరవప్రదంగా చూసుకోవాలన్నారు. డీవీస్ వెంకటనాథరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు వారి తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ, సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా, నెల్లూరు వెంకటగిరిరాజా కళాశాలలో దీర్ఘకాలం గణిత అధ్యాపకునిగా పనిచేసిన చాకిచర్ల సంజీవరావును 'గురు ప్రపూర్ణ' బిరుదుతో ట్రస్ట్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సర్వేపల్లి ప్రభాకర రావు సభను ప్రారంభించగా, ట్రస్ట్ ఉపాధ్యక్షులు సర్వేపల్లి రామమూర్తి ట్రస్ట్ లక్ష్యాలను వివరించారు. ప్రఖ్యాత విద్యావేత్త, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని అందరూ మార్గదర్శకం చేసుకోవాలన్నారు. అనంతరం, మరో 25 మంది ఉత్తమ గురువులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

జడ్పీ సిఇఒ జితేంద్ర, ట్రస్ట్ ఛైర్మెన్ సర్వేపల్లి రమణయ్య, డైరెక్టర్ శివకుమార్, సభ్యులు ములుమూడి ప్రభాకరరావు, విశ్రాంత శాస్త్రవేత్త సుందరేశన్, ప్రముఖ సారస్వతవేత్త బివి నరసింహం, ఆచార్య ఆదిత్య, మనుబోలు ఎంపిడిఓ శ్రీమతి కె.హేమలత, రాళ్ళపల్లి రామసుబ్బారావు, ఆలూరు శిరోమణిశర్మ, ఊరుబిండి వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, జి. బాబురావు, బుడంగుంట వీరభద్రయ్య, పల్లం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తొలుత దర్గామిట్టలోని నగరపాలక సంస్థ ఆవరణలో వున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి డిఇఒ ఉష పూలమాల వేసి నివాళులర్పించగా, డిఇఒను సర్వేపల్లి ఛారిటబుల్‌ట్రస్ట్‌వారు ఘనంగా సత్కరించారు.

## వింజమూరు వద్ద

# కృషి విజ్ఞాన కేంద్రం

## -- ఏర్పాటుకు రంగం సిద్ధం --

వింజమూరు మండలం కాటేపల్లి గ్రామం సమీపంలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. దీనికిగాను 50ఎకరాల భూమిని కేటాయించారు. జిల్లాలో ఇప్పటికే ఒక వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఉంది. రెండో కేంద్రాన్ని ఆత్మకూరు డివిజన్‌కు కేటాయించగా దానిని వింజమూరు మండలంలో ఏర్పాటు చేయనున్నారు. వరి ఇంకా ఇతర పంటల్లో పరిశోధనలు, అధికదిగుబడి సాధించే వంగడాలపై ఈ కేంద్రంలో పరిశోధనలు జరుగుతాయి.

# నెల్లూరుకు అన్యాయం


## ఎర్రన్నల కన్నెర్ర

రాష్ట్ర సమగ్రాభివృద్ధి పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలకు ప్రకటించిన ప్యాకేజీల్లో నెల్లూరుజిల్లాకు తీవ్రమైన అన్యాయం జరిగిందని సిపిఎం నేతలు ధ్వజమెత్తారు. ఈనెల 8న నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జిల్లాకు ప్రకటించిన ప్రాజెక్టుల్లో ఏవో ఒకటిరెండు మినహా మిగిలినవన్నీ పాతవేనన్నారు. విభజన సందర్భంగా కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 13 సంస్థల్లో ఏ ఒక్కటి కూడా జిల్లాకు కేటాయించలేదని ఆయన విమర్శించారు. దుగరాజపట్నం పోర్ట్, ఎరువుల కర్మాగారం వంటివి పాత వాగ్దానాలేనన్నారు. గత ఏడాది జిల్లాలోని సోమశిలకు, తెలుగుగంగ ప్రాజెక్టుకు, పెన్నా ఆధునీకరణకు కేటాయించిన బడ్జెట్ కంటే ఈ ఏడాది బడ్జెట్‌లో చాలా స్వల్ప మొత్తంలో నిధులు కేటాయించారని ఆయన విమర్శించారు. వెనుకబడిన కొండాపురం మండలంలోని చింతలదేవిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం నెలకొల్పాలని, వెనుకబడిన ప్రాంతాల ప్రజల నీటి అవసరాల కోసం సీతారాంసాగర్‌కు, సోమశిల హైలెవల్ కెనాల్‌కు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, పి. శ్రీరాములు, పొట్టేపాళెం చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ఇదేనా పద్ధతి

దివంగతనేత వై.యస్.రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు ఆయన వద్ద మంత్రులుగా పనిచేసినవాళ్లు, ఆయన వద్ద వంగివంగి సలాంలు చేసి పనులు చేయించుకున్న కొందరు నాయకులు ఈరోజు ఆయనపైనే విమర్శలు చేస్తుంటే విచిత్రంగా ఉంది. పదవులకోసం ఇంత దిగజారిపోతారా అని పిస్తుంది. చనిపోయిన వ్యక్తి గురించి సంస్కారమున్న వాళ్లెవరూ విమర్శలు చేయరు. వై.యస్. ఉండగా ఆయన వైపు వేలెత్తి చూపను ధైర్యం లేని నాయకులు చాలామంది ఈరోజు ఆయన లేడనే ధైర్యంతోనే అవాకులు చెవాకులు పేలుతుండడం దుర్మార్గం.

**- ముసునూరు సంజీవరావు, కావలి.**




# మోడీ పనితీరు భేష్

పదేళ్ల మన్మోహన్‌సింగ్ పరిపాలనకు, నూరురోజుల నరేంద్రమోడీ పాలనకు తేడా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మన్మోహన్ ప్రధాని పదవిలో వున్న ప్రతిక్షణం సొంత వ్యక్తిత్వాన్ని వదిలేసారు. నరేంద్ర మోడీ మాత్రం ఆత్మవిశ్వాసంతో పనిచేస్తున్నారు. మోడీ ప్రభుత్వ విదేశాంగ విధానం కూడా ఎంతో బాగుంది. ఇరుగుపొరుగు దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పడంతో పాటు అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన జపాన్‌ను దగ్గర చేసుకోవడం మోడీ పాలనావిజ్ఞతకు నిదర్శనం.

**పాతపాటి మోహన్‌రెడ్డి, ఆత్మకూరు.**

# చలనం లేని పాలన

సిద్ధా లోకం ఎట్లున్నది అంటే ఎవరి లోకం వారిదన్నట్లు పచ్చి అవినీతిపరుడు కేసీఆర్ హైదరాబాద్‌ను సింగపూర్‌లా చేస్తానంటున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో పద్దులు లేక పారదర్శకత పాటించక గిజగిజలాడుతున్నాడు చంద్రబాబు. గతంలో సుపరిపాలన అందించిన చంద్రబాబుకు ఋణమాఫీ ఉరితాడయ్యింది. ప్రభుత్వం ఏం చేస్తుందో అర్థంకావడం లేదు. బాబు మానసిక స్థైర్యం కోల్పోయి పరిపాలిస్తున్నట్లుగా ఉంది.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# తప్పుడు నిర్ణయం

రాజధానిగా విజయవాడను ఎంపిక చేయడం తప్పుడు నిర్ణయం. ఇతర జిల్లాల ప్రజలు అక్కడ ఇమడలేరు. అసలే కాస్ట్‌లీ ఏరియా. స్థలాల ధరలు ఆకాశాన్నంటుతుంటాయి. రాజధానిగా మారాక ఇక సామాన్యులు అక్కడ అడుగుపెట్టలేరు. అదీ కాక ఎన్నో వేల ఎకరాల సాగుభూమిని రైతాంగం కోల్పోవాల్సి వస్తుంది. దీనివల్ల చాలా ఉత్పత్తులు దెబ్బతింటాయి. చంద్రబాబు చాలా తప్పుడు నిర్ణయం తీసుకున్నారు.

**జి.వి.కె.ఆర్, పుదూరు.**











# మాటల్లో వైకుంఠం

## అన్నీ పాత ప్రాజెక్టులే... నెల్లూరుకు ఒరిగిందేమిటి?

**అసెంబ్లీ సమావేశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజధానిపై ప్రకటన చేస్తూ రాష్ట్రంలోని 13జిల్లాలకు జిల్లాల వారీగా కొన్నేసి వరాలు కురిపించాడు. తాను సీఎం అయ్యింది మొదలు నెల్లూరుజిల్లాను చిన్నచూపు చూస్తున్న చంద్రబాబు ఈ వరాల విషయంలో కూడా అదే దృష్టితో వెళ్లాడు.**

నెల్లూరుజిల్లాకు ఆయన ఇచ్చిన కొన్ని హామీలను చూస్తే నవ్వాలో, ఏడవాలో కూడా అర్థం కాదు. జిల్లాలో దుగరాజపట్నం పోర్టును ప్రస్తావించారు. ఈ పోర్టు గత యూపిఏ ప్రభుత్వంలోనే మంజూరై గెజిట్ నోట్ కూడా వెలువడింది. అదీ కాకుండా ఇది కేంద్రప్రభుత్వ నిధులతో నిర్మించే పోర్టు. దీంట్లో చంద్రబాబు ఘనతేముంది. అంతేకాదు, చంద్రబాబు సీఎం అయ్యాక ఈ పోర్టు వస్తుందో రాదో అన్నట్లుగా పరిస్థితులొచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం మూలంగానే ఈ పోర్టు రాకుండా పోయే అవకాశాలు ఎక్కువయ్యాయి. కావలి దగ్గర ఎయిర్‌పోర్టు అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే జిల్లాలో ఎయిర్‌పోర్టు మంజూరైంది. దామవరం వద్ద దీనికి భూసేకరణ కూడా జరిగింది. జిల్లాలో ఎయిర్‌పోర్టు కొత్తగా ఇచ్చిందేమీ కాదు.

స్వర్గీయ మాజీప్రధాని పి.వి.నరసింహారావు హయాంలోనే రాచర్లపాడు వద్ద ఇఫ్కో ఫ్యాక్టరీ మంజూరైంది. కాని కొన్ని అవాంతరాల వల్ల అది నెరవేరలేదు. దివంగతనేత వై.యస్. హయాంలో ఇఫ్కో ఫ్యాక్టరీకి సేకరించిన భూముల్లోనే కిసాన్‌సెజ్‌ను ఏర్పాటు చేశారు. కాని ఈ సెజ్‌లో ఒక్క వ్యవసాయ సంబంధిత పరిశ్రమ ఏర్పాటు కాలేదు. ఇఫ్కో భూములు అలాగే ఖాళీగా ఉన్నాయి. ఇఫ్కో ఎరువుల కర్మాగారం జిల్లాకు దశాబ్దాల కలగానే మిగిలిపోతుంది. చంద్రబాబు వాగ్దానాల్లో ఆటోమొబైల్ హబ్ ఒకటి. వై.యస్. హయాంలోనే తడ సమీపంలో శ్రీసిటీ సెజ్ రూపుదిద్దుకుంది. ఇప్పటికే ఎన్నో ఆటోమొబైల్ కంపెనీలు అక్కడ వెలిసాయి. ఇక కొత్తగా ఆటోమొబైల్ హబ్ ఏముంటుందో! చెన్నై-వైజాగ్ పారిశ్రామిక కారిడార్‌లో ఎలాగూ నెల్లూరు ఉండాల్సిందే! దానిని ప్రత్యేకంగా చేర్చేదేమీ వుండదు. హోటల్ మేనేజ్‌మెంట్ కేంద్రం గత ప్రభుత్వంలోనే మంజూరై నిర్మాణంలో కూడా వుంది. పులికాట్‌ను పర్యాటక కేంద్రంగా మార్చే అంశం చంద్రబాబు గతంలో సీఎంగా వున్నప్పటి నుండి నానుతున్నదే! గత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పులికాట్ గురించి పెద్దగా పట్టించుకోలేదు. రాష్ట్రంలో 10స్మార్ట్‌సిటీలలో నెల్లూరొకటి! రాష్ట్రంలో వైజాగ్, విజయవాడల తర్వాత అందరూ ఇష్టపడే నగరం నెల్లూరు. దీనిని స్మార్ట్ సిటీల జాబితా నుండి తప్పించలేరు.

చంద్రబాబు జిల్లాకు ఇచ్చిన వరాలు చాలావరకు పాతవే! అయితే వాటిలో ఇంకా మొదలుపెట్టనివి, మధ్యలో ఉన్నవి పూర్తి చేస్తే జిల్లాపై చంద్రబాబు పగ పట్టి ఉన్నాడన్న ప్రచారాన్ని కొంత వరకు అడ్డుకోగలరు.




***మన దేశంలో, మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలన్నీ కూడా చాలావరకు పక్కదారి పడుతూనే ఉంటాయి. మన ప్రభుత్వ రికార్డుల్లో వందెకరాల ఆసామి వార్షికాదాయం 12వేల రూపాయలుగా ఉంటుంది. రోజు కూలీకెళ్లే వ్యక్తి ఆదాయం కూడా 12వేలే ఉంటుంది. కిలో రూపాయి బియ్యం అతను తీసుకుంటాడు, ఇతనూ తీసుకుంటాడు. ఆరోగ్యశ్రీ క్రింద సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో అతనికీ ఉచిత వైద్యం, ఇతనికీ ఉచితవైద్యం.***

## 'ఆధార్' సీడింగ్‌తో...

# అక్రమార్కుల ప'రేషాన్'

మన సమాజంలో కులాలు, మతాల మధ్య స్పష్టమైన అడ్డుగోడలు కట్టారు. కాని ఆ విభజన ఉండాల్సింది ఇక్కడ కాదు. పేదలు, ధనికుల మధ్య స్పష్టమైన తేడా ఉండాలి. పేదలకు ఉద్దేశించి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అప్పుడే నూరుశాతం వారికి చెందుతాయి. కాని ఇప్పుడు అందరికీ రేషన్‌కార్డులు, అందరూ నిరుపేద జాబితాలోకి వస్తున్నందువల్ల ఈ సంక్షేమ పథకాల భారం ప్రభుత్వంపై ఎక్కువగా పడుతోంది.

గత యూపిఏ ప్రభుత్వం ఎన్నో పనికిమాలిన పనులు చేసినా ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు అనే ఒక మంచి పని చేసింది. ఈ 'ఆధార్‌కార్డు'తో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎటువంటి ప్రయోగాలు చేయలేదు. కాని ఇప్పుడు కేంద్రంలోని ఎన్డీఏ, రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వాలు సరికొత్త ప్రయోగాలు మొదలుపెట్టాయి. ఆధార్‌ను అనుసంధానిస్తూ ప్రతి కుటుంబానికీ బ్యాంక్ ఖాతా ఉండేలా కేంద్రప్రభుత్వం 'జన ధన్ యోజన' పథకాన్ని తీసుకొచ్చింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా రేషన్‌కార్డులకు ఆధార్‌కార్డులతో ముడిపెట్టింది. రేషన్‌కార్డులోని లబ్దిదారులందరూ తమ ఆధార్‌కార్డు వివరాలను అధికారులకు అందించాల్సి వచ్చింది. దీంతో భోగస్ రేషన్‌కార్డుల ఏరివేతకు మార్గం సుగమం అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో విచ్చలవిడిగా రేషన్‌కార్డులను మంజూరు చేశారు. కొందరైతే ఒక్కో పేరుతో రెండేసి కార్డులు కూడా పొందారు. ఇక రేషన్ డీలర్లు కొందరు బోగస్ కార్డులే సృష్టించారు. వాటిని తమ వద్దే ఉంచుకుని వాటి కోటాలో వచ్చిన సరుకులను అక్రమమార్గం పట్టించారు. ఇలా ప్రతి నెలా కోట్ల రూపాయల సరుకులు బ్లాక్ మార్కెట్‌లోకి వెళుతూ ప్రజాధనం వృధాకాసాగింది. ఇప్పుడు ఆధార్ సీడింగ్‌తో బోగస్ కార్డులు లేచిపోతున్నాయి. ఒక్క నెల్లూరుజిల్లాలోనే 4వేల బోగస్ రేషన్‌కార్డులను డీలర్ల సంఘం వాళ్లు జాయింట్ కలెక్టర్‌కు అప్పగించారు. ఇంకా లెక్కలోకి రావాల్సిన బోగస్‌కార్డులు చాలానే ఉన్నాయి. ఆధార్ సీడింగ్‌తో ప్రభుత్వంపై సబ్సిడీ భారం తగ్గి బ్లాక్‌మార్కెట్ కూడా ఆగిపోతుంది.



## మన నేతలకు...

# వైసీపీ రాష్ట్ర పదవులు

వైయస్సార్సీపీ చేపట్టిన రాష్ట్ర స్థాయి కమిటీల పునర్వ్యవస్థీకరణలో భాగంగా నెల్లూరుజిల్లాకు కీలకపదవులు దక్కాయి. నెల్లూరు పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డిని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా, తిరుపతి పార్లమెంట్ సభ్యులు వరప్రసాద్‌ను కేంద్ర పాలక మండలి సభ్యుడిగా నియమించారు.

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని పార్టీ అధికార ప్రతినిధిగా, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డిని పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా, మేరిగ మురళీధర్‌ను రాష్ట్ర కార్యదర్శిగా పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నియమించాడు.

## • అసెంబ్లీలో...

# నోరువిప్పిన నెల్లూరోళ్ళు

అసెంబ్లీ సమావేశాలు చాలా నికృష్టంగా జరిగాయి. సమస్యల మీద చర్చ కంటే అధిక ప్రసంగాలే అధికంగా ఉంటున్నాయి. ప్రతిపక్షం చాలా నయమనిపిస్తుంది. వాళ్ళు సమస్యల మీదే మాట్లాడారు. అధికారపక్ష సభ్యులు మాత్రం సమస్యలను వదిలేసి పాత విషయాలను తవ్వుతూ, దానిపైనే గందరగోళం రేపుతూ సమావేశాలకు అర్థంపర్థం లేకుండా చేశారు. ఇంత అడ్డదిడ్డంగా జరిగిన సమావేశాలలో నెల్లూరు ఎమ్మెల్యేలు ముఖ్యంగా వైకాపా ఎమ్మెల్యేలు తమ నోర్లు విప్పారు. సమస్యలపై స్పందించారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గత సమావేశాలలోనే కాక ఈ సమావేశాలలో కూడా తన వాగ్ధాటిని చూపారు. అలాగే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పాశం సునీల్‌కుమార్, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు కూడా జిల్లాలోని పలు సమస్యలపై మాట్లాడి తమ ఉనికిని చాటుకోవడం విశేషం.

## ఆర్డర్ ఎప్పుడు వచ్చునో...

# అందలం ఎప్పుడు దక్కునో?

### పసుపు తమ్ముళ్ళ ఎదురుచూపులు

**ఎన్నికలయ్యాయి... తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. కోటీశ్వర్లు, కాంట్రాక్టర్లు, నాయకుల మూలంగా ఆ పార్టీ అధికారంలోకి రాలేదు. కార్యకర్తల కృషి మూలంగా వచ్చింది. తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉన్న పదేళ్లలో నాయకులు, కాంట్రాక్టర్‌లు పార్టీని వదిలిపోయారు. కాని పార్టీ అంటే అభిమానమున్న కార్యకర్తలు పార్టీని వదల్లేదు. మరి అలాంటి కార్యకర్తలకు తెలుగుదేశం ప్రభుత్వంలో ఎటువంటి ప్రాధాన్యత లభిస్తుందన్నది పెద్ద ప్రశ్నగా మారింది.**

ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు కావస్తున్నా ఇంతవరకు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రయత్నం జరగడం లేదు. ఎంతోమంది నాయకులను వూరిస్తున్న టీటీడీకి స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేశారు. అలాంటిది మిగిలిన నామినేటెడ్ పదవుల విషయంలో ప్రభుత్వ వైఖరి ఏంటనేది వెల్లడి కావడం లేదు.

పార్టీ పరంగా నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జ్‌లను నియమించాల్సివుంది. గత ఎన్నికల్లో ఓడిపోయిన వాళ్లే ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్ పదవులు ఆశిస్తున్నారు. ఇక పార్టీ ప్రతిపక్షంలో వున్న పదేళ్లలో అన్నీ తానై నడిపించిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. జిల్లాలో పార్టీని గట్టిగా నిలబెట్టాలంటే ఆయనను ఎమ్మెల్సీ, మంత్రి వంటి పదవుల్లో ఉంచడం తప్పనిసరి. గతంలో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడిగా సమర్ధవంతంగా పనిచేసి బలహీనవర్గాలను పార్టీ వైపు నడిపించిన బీద రవిచంద్ర ఏకంగా టీటీడీ ఛైర్మెన్ రేసులో నిలిచి ఎంపీ, సినీనటుడు మురళీమోహన్, గాలి ముద్దుకృష్ణమనాయుడు, చదలవాడ కృష్ణమూర్తి, రాయపాటి సాంబశివరావు లాంటి వారిని ఢీ కొంటున్నాడు. ఎంపీగా ఓడిపోయిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి రాజ్యసభను ఆశిస్తుండగా, పార్టీలో ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, బల్లి దుర్గాప్రసాదరావు, కంభం విజయరామిరెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు వంటి నాయకులు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు. జిల్లాలో చూస్తే 11వ్యవసాయ మార్కెట్ కమిటీలతో పాటు 70కిపైగా దేవస్థానం కమిటీలను వేయాల్సివుంది. వీటిలో జొన్నవాడ, పెంచలకోన, నరసింహకొండ, నెల్లూరు రంగనాథస్వామి, చెంగాళమ్మ గుడి, బిట్రగుంట వెంకటేశ్వరస్వామి గుడి వంటి వాటి కమిటీ ఛైర్మెన్ పదవులకు ఎంతోమంది పోటీ పడుతున్నారు.

నామినేటెడ్ పదవుల ఎంపిక జిల్లాలోని అందరు ముఖ్యనాయకుల ఆమోదంతో జరగాల్సి ఉంది. అయితే జిల్లాలో నాయకుల మధ్య సమన్వయ లోపం పదవులను ఆశిస్తున్న వారికి ఒక సమస్యగా మారింది. ఒకరు ఆమోదం తెలిపితే ఇంకొకరు అభ్యంతరం పెట్టే పరిస్థితులున్నాయి. నామినేటెడ్ పోస్టుల ప్రక్రియ జిల్లాలో పెద్ద ప్రహసనంగానే మారనుంది.

# సోమిరెడ్డి ఆఫీసు వద్ద జాతరగా జనం

నెల్లూరు ఆదిత్యనగర్‌లో తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కార్యాలయం వద్ద ప్రతి రోజూ జనం జాతర మాదిరిగా ఉంటున్నారు. జిల్లాలో మరే తెలుగుదేశం నాయకుడి ఇంటి వద్ద కూడా ఇంత సందడి ఉండడం లేదు. సోమిరెడ్డి ఆఫీసులో ఉంటే చాలు, ఆయనతో పనివున్నోళ్లంతా వచ్చేస్తున్నారు. ఎంతమంది జనం వచ్చినా సోమిరెడ్డి కూడా ఎలాంటి విసుగు చూపకుండా వచ్చిన వాళ్లందరి సమస్యలు వింటూ, అర్జీలు తీసుకుంటూ ఎవరికి ఫోన్ చేయాలన్నా చేస్తూ ఎవరికి లెటర్‌లు కావాలన్నా ఇస్తూ అందరినీ సంతృప్తి పరచి పంపుతున్నారు. సోమిరెడ్డికి ఏ పదవి లేకుంటేనే జనం తండోపతండాలుగా వస్తున్నారు. అదే మొన్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రయ్యుంటే ఆయన కార్యాలయం ముందు క్యూలైన్లను ఏర్పాటు చేయాల్సి వచ్చేదేమో!

నెల్లూరు కబుర్లు

## 'రత్నం' విద్యార్థినికి జాతీయస్థాయి స్కాలర్‌షిప్



నెల్లూరు దర్గామిట్ట సరస్వతినగర్‌లో వున్న రత్నం హైస్కూల్ ఒలింపియాడ్ బ్యాచ్‌లో 10వ తరగతి చదువుతున్న పదో తరగతి విద్యార్థిని డి.సాహితి జాతీయస్థాయిలో జరిగిన పరీక్షల్లో 11వ ర్యాంక్ సాధించింది. జనవరి 5న "డ్రీమ్ ఓల్డ్ ఇండియా" బెంగుళూరు వారు జాతీయ స్థాయిలో మ్యాథ్స్ స్కాలర్‌షిప్ పరీక్ష 2013–14లో ఈ విద్యార్థిని రూ.10వేలు ప్రోత్సాహక బహుమతి, భారతరత్న సచిన్ టెండూల్కర్ సంతకంతో వున్న సర్టిఫికేట్ పొందింది. ఈ సందర్భంగా స్కూలు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్స్ డా॥ కృష్ణకిషోర్, వాసంతికృష్ణకిషోర్, జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, గణిత ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నాగభూషణంలు సాహితిని, వారి తల్లిదండ్రులను అభినందించారు. ప్రిన్సిపాల్ కె.వి.డి.మనోజ్‌కుమార్, ఏ.ఓ దీపిక తదితరులు పాల్గొన్నారు.

## లీలాకుమార్‌కు డాక్టరేట్

నెల్లూరుజిల్లా పెళ్ళకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు(పిఇటి)గా పనిచేస్తున్న కొండేటి లీలాకుమార్ డాక్టరేట్ పొందారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో "వివిధ శారీరక కదలికల సామర్థ్యంపై పాదముల నిర్మాణ ప్రభావం" అనే అంశంపై చేసిన పరిశోధనలు, సమర్పించిన పరిశోధన గ్రంథానికి పిహెచ్‌డి లభించినట్లు లీలాకుమార్ తెలిపారు. ఈ పరిశోధన గ్రంథాన్ని ఆచార్య ఎంవి రామ్‌కుమార్ రత్న పర్యవేక్షణలో సమర్పించినట్లు పేర్కొన్నారు.

# వదాన్యత చాటుకున్న సోమిశెట్టి దంపతులు



ప్రముఖ వదాన్యులు, లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవలందిస్తోన్న స్థానిక సుధాకర్ మెడికల్స్ అధినేత సోమిశెట్టి సుబ్రహ్మణ్యం–శ్రీలక్ష్మి దంపతులు ఇటీవల తమ వైవాహిక జీవితం 50 వసంతాల పండుగ సందర్భంగా వివిధ రంగాలవారికి మరింత వితరణ చాటి, తమ సేవాభావాన్ని నిరూపించుకున్నారు. ఈ సందర్భంగా వారు నరుకూరు వృద్ధాశ్రమానికి రూ.10 వేలు, గొలగమూడిలోని విశాలాక్షి వృద్ధాశ్రమానికి రూ.10వేలు, సీనియర్ సిటిజన్స్ సేవా కార్యక్రమాలకు రూ.10వేలు, లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు, పినాకిని వారికి పేదలకు కంటి ఆపరేషన్ల నిర్వహణ, తదితర సేవాకార్యక్రమాలకు రూ.10వేలు,నెల్లూరు వాసవి క్లబ్, అవోపా సంస్థల సేవాకార్యక్రమాలకు తమవంతు చేయూతగా 5,116 రూపాయల వంతున ధనసాయం చేసి తమ వితరణ చాటుకున్నారు. సోమిశెట్టి దంపతుల వితరణగుణాన్ని స్థానికులు అభినందిస్తున్నారు.



## మెదడును కాపాడుకుందాం

మెదడు సంబంధిత వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా వుండాలని, మెదడుకు సంబంధించిన సమస్యలేమైనా వుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ఎస్ సంపత్ కుమార్ అన్నారు. ఈ నెల 7న స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నరాలకు సంబంధించిన వ్యాధులు, మానసిక వత్తిడి వలన కలిగే సమస్యలను, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. అసోసియేషన్ అధ్యక్షులు పి. దయాకరరెడ్డి, కార్యదర్శి బి.శేషగిరిరావు, కోశాధికారి టి. నారాయణరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ శ్రీనివాసకుమార్, రాఘవేంద్రశెట్టి, నిర్మల నరసింహారెడ్డి, బి.సుందరరామిరెడ్డి, అమరేంద్రరెడ్డి, ఎన్ఎల్‌వి ప్రసాద్, షణ్ముగం, కె.ఎం.రెడ్డి, రంగారావు, సురేష్‌కుమార్, ఓబుల్‌రెడ్డి, చంద్రమౌళిరెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ ఛైర్‌పర్సన్ నలుబోలు బలరామయ్యనాయుడు, డాక్టర్ సత్యనాథ్, డాక్టర్ ఎంఎస్‌రెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు లయన్స్ సత్కారం



ఎస్.వి.కృష్ణయ్య, మద్దూరి శ్రీనివాసులును సత్కరిస్తున్న లయన్స్ సభ్యులు

లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు–ప్రతిభ ఆధ్వర్యంలో ఈనెల 5న గురుపూజోత్సవం, జర్నలిస్టుల డే సందర్భంగా స్థానిక డిఆర్ ఉత్తమలో గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురికి ఘన సన్మానాలు జరిగాయి. లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు–ప్రతిభ అధ్యక్షులు వి.ధనుంజయ, కార్యదర్శి వి.శ్రీధర్, సహాయ కోశాధికారి కెవి రాఘవేంద్రరావు, లయన్స్‌క్లబ్ ప్రతిభ వ్యవస్థాపకులు లయన్ ఎస్ఎస్‌వి రామ్మోహనరావు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, పల్లెపాడు గాంధీ ఆశ్రమం ప్రచార కమిటీ అధ్యక్షులు రొంపిచర్ల శివరామయ్య సేవలను ప్రస్తుతిస్తూ ఘనంగా సత్కరించారు. అదేవిధంగా, జర్నలిస్టుల దేని పురస్కరించుకుని సీనియర్ జర్నలిస్టులు మద్దూరి శ్రీనివాసులు (లాయర్ వారపత్రిక), ఎస్‌వి కృష్ణయ్య (ఆంధ్రజ్యోతి పాత్రికేయులు)ను ఘనంగా సన్మానించారు. పత్రికారంగంలో వారు చేస్తున్న విశిష్ట కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రతిభగలిగిన విద్యార్థుల చదువుకు చేయూతగా ఒక బిటెక్ విద్యార్థినికి, పలువురు విద్యార్థులకు కలిపి లయన్స్ క్లబ్ తరఫున రూ.38వేలు ఆర్థిక సాయం అందజేశారు. వియానీహోం వారికి పౌష్టికాహారం ప్యాకెట్లను రీజనల్ ఛైర్మన్, లయన్ ఆర్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌ఓ లయన్ నూనె శ్రీధర్, మాజీ అధ్యక్షులు లయన్ రాజాచంద్ర, లయన్ బద్రీనాథ్, కె.సత్యనారాయణ, ఎ. మస్తానయ్య, పి.వి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

### పార్లమెంటరీ పరిశీలకుడిగా
## ముక్కు కాశిరెడ్డి

ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే ముక్కు కాశిరెడ్డిని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు పార్లమెంటరీ పరిశీలకుడిగా పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నియమించి ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆత్మీయసత్కారం

భగవాన్ సత్యసాయిబాబా 89వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలోని రామ్మూర్తినగర్‌లో ఉన్న దత్తసాయి భజన మందిరంలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ వేదపండితులకు ఆత్మీయసత్కారం జరిగింది. సమితి కన్వీనర్ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వందమంది పేద బ్రాహ్మణ దంపతులను వస్త్ర తాంబూలాలతో సన్మానించారు. సత్యసాయి బాబా భక్తులపట్ల అనుసరించిన మార్గంలో పేదలను ఆదుకోవాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సమితి కన్వీనర్ పేర్కొన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు నరహరిరెడ్డి, రాళ్ళపల్లి రామసుబ్బారావు, గురుప్రకాష్, వాకాటి విజయకుమార్‌రెడ్డి, సత్యనారాయణ, దేగా నరసింహారెడ్డి, బెజవాడ ఫణిరెడ్డి, ప్రసన్నరెడ్డి, రాజేశ్వరమ్మ, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీనివాస కల్యాణం

నగరంలోని టిటిడి కల్యాణ మండపంలో ఈ నెల 7న శ్రీనివాస కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, గోవిందనామస్మరణల మధ్య, టిటిడి ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం వేడుకగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. టిటిడి ధర్మప్రచార మండలి ఉపాధ్యక్షులు కొండా శేఖరరెడ్డి, సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

### కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యల
## పరిష్కారానికి కృషి

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేసేందుకు పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కాంట్రాక్ట్ ఉద్యోగులకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హామీఇచ్చారు. మంగళవారం నెల్లూరుజిల్లా కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీధర్‌రెడ్డిని కలసి తమ సమస్యలు తెలిపారు.

## ద్వారకా కారుకు ప్రమాదం

నెల్లూరు నగరపాలకసంస్థ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ కారు మంగళవారం ప్రమాదానికి గురైంది. నెల్లూరురూరల్ మండలం ఆమంచర్ల జడ్పీ హైస్కూల్‌లో జరిగిన గ్రిగ్స్ పోటీల ముగింపు సభలో పాల్గొని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ద్వారకానాథ్ ఒకే కారులో బయలుదేరారు. వీరి కారు వెనుక ద్వారకా కారులో వీరి పిఏలు కూర్చున్నారు. కొత్తూరు – దొంతాలి క్రాస్‌లో పిఏలున్న వాహనం చెట్టును గుద్దుకుంది. దీంతో ఎమ్మెల్యే పిఏ విష్ణు, ద్వారకా పిఏలు సుబ్బన్న, మురళీకృష్ణ, 5వ డివిజన్ కార్పొరేటర్ రవిచంద్ర, శామ్యూల్‌లు గాయపడ్డారు. వారిని వెంటనే సింహపురి ఆసుపత్రికి తరలించి చికిత్సనందించారు.

## బాలభవన్ విద్యార్థుల ప్రతిభ

నెల్లూరులోని జవహర్ బాలభవన్‌కు చెందిన పలువురు విద్యార్థులు కరాటే పోటీల్లో తమ ప్రతిభను నిరూపించుకుని బహుమతులు అందుకున్నారు. ఇటీవల గుంటూరుజిల్లాలోని చిలకలూరిపేటలో రాష్ట్రస్థాయిలో జరిగిన కరాటేపోటీల్లో నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటకు చెందిన విద్యార్థులు జి. మహర్షి, సిద్దార్థ, రాఘవులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించి కరాటేలో జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారని కరాటే మాస్టర్ విజయ్ భరద్వాజ్ తెలిపారు.

## మళ్ళీ ఎండలు

నెల్లూరుజిల్లా మీద సూర్యభగవానుడు పగబట్టినట్లున్నాడు. సెప్టెంబర్ నెలమధ్యలోకి వచ్చినా ఎండలు తగ్గడం లేదు. ఓ పక్క ఉత్తరాంధ్రలో వరదలు పోటెత్తుతున్నాయి. ఇక్కడ మాత్రం కంటితుడుపుగా ఒకట్రెండు రోజులు వానలు కురిసాయి.

సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ పుణ్యమా అని ఇంత ఎండలు కాస్తున్నా నెల్లూరులో నీటి కొరత మాత్రం లేకుండా ఉంది.

# గిఫ్ట్‌సిటీలో నారాయణ బృందం

## గాంధీనగర్‌లోని గిఫ్ట్‌సిటీ, సచివాలయం, పెట్రోలియం యూనివర్శిటీల సందర్శన



దేశంలోని పలు ముఖ్య రాజధాని నగరాల్లో అనుసరించిన నిర్మాణ పద్ధతులు, ప్రణాళిక అంశాలను అధ్యయనం చేసే ప్రక్రియలో భాగంగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ శాఖా మంత్రి డా॥ పి.నారాయణ ఆధ్వర్యంలో పర్యటిస్తున్న అధికారుల బృందంతో నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ మంగళవారం గాంధీనగర్‌లో పర్యటించారు. ఉదయం గాంధీనగర్ చేరుకున్న బృందాన్ని గుజరాత్ పట్టణాభివృద్ధిశాఖ, ఇతర శాఖల ఉన్నతాధికారులు స్వాగతించి గిఫ్ట్‌సిటీ(గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ మరియు టెక్నాలజీ సిటీ)కి తీసుకెళ్లారు. గిఫ్ట్‌సిటీలో వివిధ ప్రభుత్వ భవన సముదాయాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటైన మౌలిక సదుపాయాలు, సాంకేతిక వ్యవస్థలను బృందసభ్యులు పరిశీలించారు.

నెల్లూరు పట్టణాన్ని స్మార్ట్‌సిటీగా రూపుదిద్దనున్నట్లు కేంద్రప్రభుత్వం నుంచి అనుమతి రానున్న నేపథ్యంలో కల్పించవలసిన పౌర వసతుల గురించి మున్సిపల్‌శాఖా మంత్రి నారాయణ, నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నెల్లూరులో సుమారు 1500కోట్ల రూపాయల వ్యయంతో భూగర్భ డ్రైనేజీవ్యవస్థ మరియు త్రాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు పంపారు. ఈ నేపథ్యంలో గాంధీనగర్‌లో అమలులోవున్న డ్రైనేజీ మరియు త్రాగునీటి సరఫరా వ్యవస్థ, వ్యర్థపదార్థాల తరలింపు, నిర్వహణ పద్ధతుల గురించి నెల్లూరు మేయర్ ప్రత్యేకంగా ఈ పర్యటనలో అధ్యయనం చేశారు. రాష్ట్ర రాజధానిగా నిర్మించిన నయా రాయ్‌పూర్‌లో కూడా మంత్రితో పాటు మేయర్ అజీజ్ సందర్శించి అక్కడ పట్టణ మౌలిక వసతులు, పౌరులకు కల్పిస్తున్న వివిధ సదుపాయాలను అధ్యయనం చేశారు. ఈ బృందంలో మంత్రితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని సలహా కమిటీ సభ్యులు, నెల్లూరుజిల్లాకు చెందిన మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు కూడా వున్నారు.

# విశిష్టంగా "విశ్వసాయి" ప్రతిభా పురస్కారం




నెల్లూరు దర్గామిట్టలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఈ నెల 6న విశ్వసాయి విద్యాసంస్థల ప్రతిభా పురస్కార ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి సివిస్ పరంధామయ్య మాట్లాడుతూ గురువులు అంటే తాను కరుగుతూ విద్యార్థుల జీవితాలలో విజ్ఞాన జ్యోతులు వెలిగించే ఆదర్శవంతులని పేర్కొన్నారు. తదుపరి మెడికల్, ఇంజనీరింగ్ ప్రవేశపరీక్షల్లో ప్రతిభ కనపరచిన 100మంది విద్యార్థులకు అవార్డులు అందించారు. రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన విశ్వసాయి విద్యార్థిని కుమారి యం.రిషితకు ప్రోత్సాహక నగదు పురస్కారం రూ.50,000/- అందించారు. మరొక ముఖ్యఅతిథి జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి జాకబ్ మాట్లాడుతూ పోటీ వుంటేనే అభివృద్ధి సాధ్యమని, సాంకేతికతను ఉపయోగించుకుంటూ విద్యను మెరుగు పరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ ఫిజిషియన్ డా॥ సి.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అరమరికలు లేని వ్యక్తిత్వంగల ఉపాధ్యాయులవల్లే నేటికీ విద్యావ్యవస్థ ఉన్నతంగా విరాజిల్లుతుందన్నారు. అతిథిగా పాల్గొన్న మాడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికే జీవితాలను అంకితం చేసిన ఎందరో ఆదర్శవంతులను గుర్తు చేస్తూ విశ్వసాయి కళాశాల కృషిని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డా॥ ఎన్.సత్యనారాయణ, వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్‌రావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# నేతలు తగాదాల్లో.. అభివృద్ధి గాల్లో!

**- కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి**



నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో ఈ నెల 9న కాంగ్రెస్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలకు గాలికి వదిలేసి మేయర్, ఎమ్మెల్యేలు ఒకరినొకరు దుమ్మెత్తి పోసుకుంటూ అభివృద్ధిని మరిచిపోయారన్నారు. వీరు తమ ప్రాభవం కోసం అధికారులను దుర్భాషలాడు తున్నారన్నారు. పాలకవర్గం ఏర్పడి రెండు నెలలయినా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయలేదని, వారి తీరు మారకపోతే కాంగ్రెస్‌పార్టీ పోరాటాలకు సంసిద్ధమవుతుందని హెచ్చరించారు. ఎన్నికల ముందు మంజూరైన రూ.13కోట్ల ఎస్‌డిఎఫ్ నిధులు వీరు పట్టించుకోకపోవడంతో వెనక్కి వెళ్ళాయన్నారు. కాంగ్రెస్ పాలనలో పాలకులు, అధికారులు ఒకే కుటుంబంగా మెలిగి నగరాన్ని ఎంతో అభివృద్ధి చేసామన్నారు. సమావేశంలో అళహరివిజయ్, వినోద్‌రెడ్డి, సుజాత, దిలీప్, శివాచారి తదితరులు పాల్గొన్నారు.

# చేనేతకు చేయూత ఏదీ?

**- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**



చేనేత రంగాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందని, చేనేత సోదరుల సమస్యల కోసం సాగే ప్రజా ఉద్యమాల్లో ముందుండి పరిష్కారం కోసం ఉద్యమిస్తానని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని సంతపేట సిపిఐ కార్యాలయం వద్ద జరిగిన ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 9వ మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు చేనేత రంగం మారుపేరని, నాగరికత లేని రోజుల్లో ప్రపంచానికి అగ్గిపెట్టెలో పట్టే పట్టు చీరను నేసి ఇచ్చింది భారతదేశమని కొనియాడారు. రాష్ట్ర అసెంబ్లీలో చేనేత కుటుంబాల సంక్షేమం కోసం ప్రత్యేకచర్చ కోరతామన్నారు. నెల్లూరురూరల్ నియోజకవర్గంలో చేనేత కుటుంబాలు ఎక్కువగా నివసించే నారాయణరెడ్డిపేట, ములుమూడి, సౌత్‌మోపూరు గ్రామాల్లో అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

# పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

## నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని 9వ డివిజన్ నవాబుపేటలో వున్న మునిసిపల్ హైస్కూలు (ప్రత్తివారి స్కూలు)ను సందర్శించి విద్యార్థులతో పాఠశాల సదుపాయాలు గురించి చర్చించారు. అనంతరం వాటర్ ప్యూరిఫైయర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ప్రయోగశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్

# ఇంకా గడువు కావాలి

## కలెక్టర్‌ను కోరిన జంపింగ్ జడ్పీటీసీలు

తమపై చర్యలు తీసుకోకుండా మరో మూడు వారాలు గడువు కావాలని 8మంది జడ్పీటీసీలు సోమవారం జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌ను కలిసి గడువు కోరారు. జూలై నెలలో జరిగిన జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నికల్లో వైకాపాకు చెందిన 8మంది జడ్పీటీసీ సభ్యులు విప్‌ను ధిక్కరించి తెలుగుదేశంపార్టీ వైపు మొగ్గుచూపారు. వారిపై అనర్హతవేటు వేయాలని వైకాపా నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో 8మంది జడ్పీటీసీలు మరో 3వారాలు గడువు కావాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.

# ప్రజలు మెచ్చేలా చంద్రబాబు పాలన

**బీద రవిచంద్ర ప్రశంస**



రాష్ట్ర వరిపాలనను చక్కదిద్ది, ప్రజలు మెచ్చేలా పాలన సాగించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర అన్నారు. ఈ నెల 8న నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు అస్తవ్యస్త మయ్యాయని విమర్శించారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి అన్ని రంగాల్లో అభ్యున్నతిని సాధించేందుకు, ప్రజల సమస్యల పరిష్కారానికి చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని, ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేయడానికి అనేక పథకాలు రూపొందిస్తున్నారని, ప్రభుత్వ పథకాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో జిల్లా అభ్యున్నతికి కూడా చంద్రబాబునాయుడు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, ఈ విషయాలన్నిటినీ టిడిపి కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్ళి, ప్రభుత్వ అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లక్ష దాకా వ్యక్తిగత రుణ పరిమితి

**- మెట్టుకూరు ధనుంజయరెడ్డి**



నెల్లూరులోని డీసీసీబీ సమావేశ మందిరంలో ఈ నెల 9న మహాజనసభ జరిగింది. సభకు అధ్యక్షత వహించిన బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ రుణమాఫీ పథకం ద్వారా 51వేల మంది రైతులకు మేలు చేకూరుతుందని తెలిపారు. ఈ సంవత్సరం బ్యాంకు అప్పులు రూ.380 కోట్లు వున్నాయని, అందులో రుణ మాఫీ వర్తించే అప్పులు రూ. 200కోట్లు దాకా వుంటుందని తెలిపారు. 2013-14 సంవత్సరం బ్యాంకు జమ, ఖర్చులు ఆడిట్ చేయించగా ఆదాయం తగ్గిందని, 14చేనేత సహకార సంఘాలకు రూ.35లక్షల రుణాలు బోర్డు మంజూరుచేసిందని తెలిపారు. ఈ సభలో వ్యక్తిగత రుణ పరిమితి లక్ష రూపాయల పెంపునకు సభ్యులు ఆమోదం తెలిపారు. 2014-15 సంవత్సరానికి సవరించిన అంచనాలతో రూ.49.31కోట్ల బడ్జెట్‌ను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# గూడూరు డివిజన్ వార్తలు

## టీడీపీ నాయకులను, అధికారులను...

# తప్పుదోవ పట్టిస్తున్నారు

**- జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోడూరు శ్రీనివాసులురెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న కోడూరు శ్రీనివాసులురెడ్డి

గూడూరు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి తానేనని డాక్టర్ బత్తల రాధాజ్యోత్స్నలత చెబుతూ పార్టీ నాయకులను, అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోడూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. గూడూరులోని పంచాయతీ రాజ్ అతిథిగృహంలో ఇటీవల ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా అధికారం లేకపోయినా నానా బాధలుపడి, ధర్నాలు చేస్తే గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమపై అక్రమ కేసులు పెట్టినా భరించి పార్టీలో కొనసాగుతున్నామని, ఇప్పుడు వచ్చిన ఈమె కాంగ్రెస్, వైకాపా వారికి పదవులు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గానికి చెందిన నాయకులు మూడురోజులుగా జిల్లా పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కమిటీ సమన్వయకర్త వి.వి.ఆర్.చౌదరిని కలిశారన్నారు. జిల్లాలోని గూడూరు, నెల్లూరు గ్రామీణ నియోజకవర్గాలలో ఎలాంటి ఇన్‌ఛార్జిలను నియమించలేదని స్పష్టం చేశారన్నారు. త్వరలో ఎవరనేది సీఎం నిర్ణయం తీసుకొంటారన్నారు.

ఆయన వెంట పలు మండలాల అధ్యక్షులు బి.కోటేశ్వరరావు, ఉచ్చూరు వెంటేశ్వర్లు రెడ్డి, రవీంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, మాజీసర్పంచులు వెంకటేశ్వరరాజు, నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆటపాటలతో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



ఎల్‌ఏపి పాఠశాల కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యంరెడ్డిని సన్మానిస్తున్న మనోహర్‌రెడ్డి, పక్కన శ్రీకాంత్‌రెడ్డి

గురుపూజోత్సవం సందర్భంగా ఈ నెల 5న గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గూడూరు నియోజకవర్గంలోని 31పాఠశాలల ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించారు. షాట్‌పుట్, మ్యూజికల్‌ఛైర్, త్రోబాల్, లెమన్ అండ్ స్పూన్ తదితర పోటీల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తరువాత డీఎన్‌ఆర్ కమ్యూనిటీ హాలులో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎల్‌ఏపి పాఠశాల కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యంరెడ్డిని, విద్యానగర్ బాలభారతి పాఠశాల కరస్పాండెంట్ కర్రా సుందరరామయ్యను ప్రైవేటు పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు కష్టపడాలని సూచించారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు సులభరీతిలో ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, ఉపవిద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, ప్రైవేటు స్కూల్స్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రమోహన్, సంజీవరాజు, సురేంద్రరెడ్డి, కమలాకర్, మహేశ్వరరెడ్డి, జీవి.పవన్‌కుమార్, సంఘం గౌరవాధ్యక్షుడు దశరథరామి రెడ్డి, కె.ఆర్.రెడ్డి, ఇంకా ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాగా పట్టణంలోని బ్రాహ్మణసేవాసమాఖ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయురాలు వేదవతి, గురుగుహా, పవన్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మరియు న్యాయవాది వై.చలపతిరావు, కార్యదర్శి శ్రీనివాసులు, ఎస్.నాగరాజారావు, వై.భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.





## 19న 'ఆగడు'

సూపర్‌స్టార్ మహేష్‌బాబు, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ శ్రీనువైట్ల కాంబినేషన్లో వస్తున్న 'ఆగడు' ఈ నెల 19న ప్రపంచవ్యాప్తంగా భారీఎత్తున విడుదల కానుంది. 'దూకుడు'లాగే 'ఆగడు' కూడా సక్సెస్ అవుతుందని సినీ పరిశ్రమలో నమ్మకముంది.



## శ్వేతపై 'మంచు'

వ్యభిచారం కేసులో అరెస్టై, మీడియాలో హాట్ టాపిక్‌గా మారిన హీరోయిన్ శ్వేతబసు ప్రసాద్‌ను సినీ పరిశ్రమలో కొందరు విమర్శిస్తున్నా, హీరో మంచు విష్ణు మాత్రం ఆమెకు మద్దతుగా నిలిచాడు. తన ఇంటి పేరుకు తగ్గట్లే తన హృదయం కూడా మంచు లాంటిదేనని చాటాడు. తన తదుపరి చిత్రంలో ఆమెకు మంచి రోల్ ఇస్తానని విష్ణు చెబుతున్నాడు. బడాబాబులను వదిలేసి శ్వేతను మాత్రం అదేపనిగా చూపించిన మీడియాపైన, పోలీసుల పైన కూడా ఆయన మండిపడ్డారు. శ్వేత పట్ల తన సానుభూతిని చూపారు.

# మూ'వీ'క్షణం




## జూనియర్ జాగ్రత్తలు

బాక్సాఫీస్ వద్ద చాలా సినిమాలు బోల్తా కొట్టడంతో జూ.ఎన్టీఆర్ తదుపరి సినిమాల ఎంపికపై చాలా జాగ్రత్త వహిస్తున్నట్లు తెలుస్తోంది. డైరెక్టర్లు తెచ్చిన కథలను సమగ్రంగా చదివిన తర్వాత తనకు నచ్చితేనే వారికి కాల్షీట్లు ఇస్తున్నాడట!

## 'కిక్'కు రెడీ...

సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న చిత్రం 'కిక్-2'. కిక్ సినిమాలో రవితేజతో పాటు సమానంగా 'కిక్'నిచ్చిన హీరోయిన్ ఇలియానా. ఇప్పుడామె బాలీవుడ్‌లో బిజీగా ఉండడంతో ఆ మాత్రం కిక్ ఇచ్చే వాళ్లెవరని వెతుకుతుండగా దర్శకుడికి రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించిందని టాలీవుడ్‌లో టాక్! 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాలో రకుల్ ఎక్స్‌ప్రెషన్స్‌ను చూసి దర్శకుడు ఆమెకు ఈ ఛాన్స్ ఇచ్చాడట! ఇలియానాకు ఏ మాత్రం తగ్గకుండా రకుల్ కిక్ ఇస్తుందన్న గట్టి నమ్మకంతో సురేందర్‌రెడ్డి ఆమెకు ఛాన్స్ ఇచ్చాడట!

# గురువులను సత్కరించిన 'లయన్స్'



అంగనవాడీ టీచర్ కామాక్షమ్మ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, ప్రక్కన గూడూరు జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.శివకుమార్

గూడూరు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇటీవల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులు కె.రామరాజు, అక్కన వీణాపాణి, యస్.మేరీశ్యామ్‌సుందరి, యు.చంద్రసేన, అలివేలి మాధురి, గాయం సుజాత, మున్వర్‌బాషా, పూలతోట అంగనవాడీ టీచర్ ఆనిమెళ్ళ కామాక్షమ్మలను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చిన్నతనంలో ఉపాధ్యాయుల వద్ద నేర్చుకున్న అక్షరాభ్యాసం జీవిత చరమాంకం వరకు గుర్తుంటాయని అన్నారు. అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగిన వ్యక్తులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించేది ఉపాధ్యాయులేనని చెప్పారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు తోట సురేష్‌నాయుడు, మల్లు విజయకుమార్‌రెడ్డి, షేక్ రియాజ్ అహ్మద్, నవీన్ జయకుమార్, చంద్రశేఖర్, పిఆర్వో కడివేటి చంద్రశేఖర్, యంఇఓ యం.డి. ఇస్మాయిల్, సోమిశెట్టి చెంచురామయ్య, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బాలుర ఉన్నత పాఠశాలకు స్టేట్‌బ్యాంక్ కంప్యూటర్



కంప్యూటర్‌ను బహుకరిస్తున్న స్టేట్‌బ్యాంక్ గూడూరు శాఖ చీఫ్ మేనేజర్ మురళీకృష్ణ

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5న జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలకు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గూడూరు శాఖ తరపున రూ.27,000/-లు విలువచేసే ఒక కంప్యూటర్‌ను ఆ బ్యాంకు చీఫ్ మేనేజర్ వై.మురళీకృష్ణ బహుకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి భవిష్యత్తు కొరకు మార్కులను, జ్ఞానాన్ని సమానంగా సంపాదించాలని తెలిపారు. స్టేట్‌బ్యాంక్ దేశవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు ఆదర్శ ఉపాధ్యాయులుగా ఉండాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ అసిస్టెంట్ జి.శివయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూలు ఇన్‌ఛార్జి హెడ్మాస్టర్ జె.వెంకటయ్య, ఎల్ఐసి బిఎమ్ రాము చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థికంగా బాగుండినా ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపండి. అనుకున్న పనులు నిదానంగా జరగడం వల్ల టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆశించిన ఆదాయం ఉండదు మరియు అవకాశాలు తగ్గగలవు. బంధువర్గం వల్ల స్వల్ప సమస్యలుంటాయి. ఉద్యోగులు విధినిర్వహణలో జాగ్రత్తగా ఉండాలి. విమర్శలకు చోటివ్వవద్దు.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తివ్యాపారాలు సంతృప్తిగా జరిగి ఆదాయ లోపం ఉండదు. మంచి ఆర్థికాభివృద్ధి అవకాశాలు దొరుకు తాయి. అనుకున్న పనులకు ఆటంకాలుండినా పట్టుదలతో విజయవంతంగా నిర్వహిస్తారు. ప్రముఖులను, పెద్దలను కలుసుకొని జరుగబోవు కార్యములను నిర్ణయిస్తారు. ప్రభుత్వ అనుమతులు పొందుతారు. నిరుద్యోగులకు అవకాశాలు లభిస్తాయి.

### మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అవసరాలకు ముఖ్యపనులకు ఋణం చేయవలసి వస్తుంది. వ్యాపార విస్తరణ అవకాశాలు సన్నగిల్లుతాయి. ఆస్తివ్యవహారాలు వాయిదా వేయండి. వృత్తి వ్యాపారాలలో సామాన్య ఆదాయం ఉంటుంది. బిడ్డల విద్య, శుభకార్య వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవస్థలో గుర్తింపు గౌరవాలుంటాయి. నూతన సదుపాయాలు ఏర్పరచుకొంటారు.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. కుటుంబసభ్యుల సహకారం బాగుంటుంది. ఆదాయము ఖర్చులు సరిపోతుంటాయి. పెట్టుబడులకు, భాగస్వామ్య వ్యాపారాలకు అవకాశాలు లభించగలవు. వస్తు వాహన రిపేర్లుండగలవు. దూరప్రయాణాలు జరపవలసి వస్తుంది. కమిటీ సమావేశాలలో మీ సలహాలకు గుర్తింపు, పలుకుబడి బాగుంటుంది.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

పట్టుదలతో నిర్ణయాలు చేసి ఇబ్బందులు పడకుండా చూచుకొనండి. వృత్తి వ్యాపారాలలో స్వల్పంగా అభివృద్ధి ఆదాయం ఉంటుంది. కుటుంబసభ్యుల ఖర్చులు పెరుగుతాయి. శుభకార్యముల విషయంలో కాలయాపన జరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు లాభదాయకంగా ఉంటాయి. విమర్శలకు దూరంగా ఉండండి. ప్రయాణాలుంటాయి జాగ్రత్తపడాలి.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి ఉద్యోగ వ్యాపారాలలో కొంత అయిష్టంగానే పనులు చేయవలసి వస్తుంది. ఖర్చులు మోతాదు పెరిగినా ఆర్థిక ఇబ్బందులుండవు. ఉద్యోగులపై ప్రభుత్వ, పబ్లిక్ వత్తిడి ఎక్కువగా ఉంటుంది. బంధువర్గం రాకపోకలుంటాయి. శుభకార్య నిర్ణయాలలో అనుకూలత ఉంటుంది. వస్తువాహన గృహ రిపేర్లుంటాయి. పనుల నిర్వహణలో టెన్షన్ విసుగు ఎక్కువగా ఉంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 12.9.2014 నుండి
తేది. 18.9.2014 వరకు

ఈ వారం మీనంలో కేతువు, మేష వృషభ మిధున రాశులలో చంద్రుడు, కర్కాటకంలో గురువు, సింహంలో శుక్రసూర్యులు, 17తేది నుండి కన్యలో రవి, కన్యలో బుధరాహువులు, తులలో శని, వృశ్చికంలో కుజుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

మహాలయ పక్షాలు జరుగుచున్నది.
తేది 16 మంగళవారము మధ్యాష్టమి.

**భాద్రపద మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 12 | శుక్ర | చతుర్థి | రా॥గం.12.20వ॥ |
| తేది. 13 | శని | పంచమి | రా॥గం.11.10వ॥ |
| తేది. 14 | ఆది | షష్ఠి | రా॥గం.10.28వ॥ |
| తేది. 15 | సోమ | సప్తమి | రా॥గం.10.30వ॥ |
| తేది. 16 | మంగళ | అష్టమి | రా॥గం.10.56వ॥ |
| తేది. 17 | బుధ | నవమి | రా॥గం.11.49వ॥ |
| తేది. 18 | గురు | దశమి | రా॥గం.1.14వ॥ |

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

పరుషంగా మాట్లాడడం, మొండిగా ప్రవర్తించడం వల్ల ఇబ్బంది పడతారు. ఆర్థిక వ్యవహారాలలో సరైన నిర్ణయాలు చేయలేక ఇబ్బంది పడతారు. వృత్తి వ్యాపారాలలో ఆర్థికావకాశాలు చేజారిపోవచ్చును. ఆదాయం తగ్గుతుంది. ఉద్యోగులకు పనిభారం స్థానమార్పులు, పబ్లిక్‌తో ఇబ్బందులుంటాయి. బాకీలు చెల్లింపులు నిలబడిపోవడం, కోర్టు కేసులు వాయిదా పడడం జరుగుతుంది.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

మాటలలో గాని, వ్యవహారాలలో గాని తొందరపాటు ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఒక మోస్తరుగా అభివృద్ధి, రాబడి ఉంటుంది. ఇతరులకు ధన వస్తు రూపంలో సహాయం చేస్తారు. పెట్టుబడులకు, భాగస్వామ్య వ్యాపారాలకు అవకాశాలు, ఆహ్వానాలుంటాయి. శుభకార్య నిర్ణయాలలో సానుకూలత కనబడుతుంది. అదనపు ఖర్చులు ఏదో ఒక రూపంలో తప్పవు.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

బంధువర్గం వల్ల గాని, బిడ్డల వల్ల గాని ఇబ్బందులుంటాయి. వృత్తివ్యాపారాలలో సామాన్యవృద్ధి, సామాన్య ఆదాయముంటుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలు కొంతకాలం ఆపుట మంచిది. సోదరులతో విభేదాలు రావచ్చును. ఆర్థిక నిర్ణయాలలో శక్తి చాలక ఇతరుల సలహాను కోరుతారు. శరీరానికి గాయాలు తగల వచ్చును. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది.


### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కార్యసాధకులై పనులు చక్కబెడతారు. మీతో విభేదించినవారే మీకు సన్నిహితము కాగలరు. వృత్తి వ్యాపారాలలో కొత్త పథకాలు ఆలోచిస్తారు. ఆదాయము సామాన్యంగా ఉంటుంది. వస్తు వాహన రిపేర్లు చేపడుతారు. స్త్రీలకు పిల్లలకు అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగులకు క్యాంపులుండటం, పనిభారం పెరగడం జరుగుతుంది. శుభకార్య పథకాలు నిర్ణయం కాగలవు.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తివ్యాపారాలలో అంతగా వృద్ధి ఉండదు. ఆదాయం తగ్గుతుంది. ఖర్చులు అదనంగా పెరుగుతాయి. బంధువర్గంతో గాని మిత్రవర్గంతోగాని విభేదాలు రావచ్చును. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. చెల్లింపులు, బ్యాంకు పనులందు జాగ్రత్త అవసరం. కుటుంబసభ్యుల అనుకూలత సరిగా ఉండదు. ఇతరుల వ్యవహారాలలో తలదూర్చకండి. అవివాహితులకు, నిరుద్యోగులకు మంచి జరగడానికి అనుకూల సమయం.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

రాబడి, ఖర్చులు సరిపోతుంటాయి. నిరుద్యోగులకు, వృత్తి జీవనం కలవారికి అవకాశాలు బాగుంటాయి. వ్యాపార వర్గాలవారు కొత్త ప్రయత్నాలు, పథకాలతో అభివృద్ధికి కృషిచేస్తారు. ప్రభుత్వ అనుమతులు పొందుతారు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. పనులు టెన్షన్ పెట్టి కొనసాగుతాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలుకే

**- జిల్లా కలెక్టర్ హెచ్చరిక**



లింగ నిర్ధారణ పరీక్షలు చేయడాన్ని ప్రభుత్వం నిషేధించివుందని, కనుక అలాంటి పరీక్షలు చేస్తే చట్టరీత్యా నేరమని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ అన్నారు.

గర్భస్థ పిండ పరీక్ష ప్రక్రియ, లింగ ఎంపిక నిషేధ చట్టంపై ఈ నెల 6న నగరంలోని గోల్డన్ జుబ్లీహాల్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నిరక్షరాస్యత, అవగాహన లేమి కారణంగా స్త్రీ జననాల సంఖ్య క్రమేణా తగ్గిపోతోందని, దీనివల్ల భవిష్యత్తులో అనేక దుష్పరిణామాలు ఏర్పడతాయన్నారు. గర్భస్థ పిండ పరీక్షలు చేయించుకుని, ఆడ శిశువు పుడుతుందని తెలిసినప్పుడు వెంటనే అబార్షన్ చేయించుకోవడం జరుగుతోందని, అలాంటివి జరగకుండా ప్రభుత్వం లింగ ఎంపిక నిషేధ చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షలు చేసేవారిని గుర్తించి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, వైద్యులు, పోలీసులు పదిహేనురోజులకొకసారి ఈ విషయమై సమీక్షించి, లింగనిర్ధారణ పరీక్షలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటేశ్వరి అధ్యక్షత వహించారు. ఇఇహెచ్‌ఎఫ్ వెల్ఫేర్ డి.డి డాక్టర్ రవికిరణ్‌శర్మ పాల్గొని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా గర్భస్థ పిండ, లింగ వివక్ష పరీక్షల నిషేధ చట్టాన్ని అందరికీ అవగాహన కలిగేవిధంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సుబ్బలక్ష్మమ్మ, అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఓ పద్మావతి, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు ఇవిఎస్ నాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మరణించినా జీవించేవారే ఉత్తములు

నెల్లూరు మద్రాసుబస్టాండు దగ్గర గల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటిలో ఈ నెల 6న కీర్తిశేషులైన రెడ్‌క్రాస్ మేనేజర్ కె.సుధాకర్‌రెడ్డి సంతాపసభ జరిగింది.

ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డా॥ ఈదూరు సుధాకర్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఖాళీగా ఉన్న రెడ్‌క్రాస్ మేనేజర్ పోస్టుకు రాష్ట్ర గవర్నర్ సిఫారసుతో నియమితులైన నాలుగురోజులకే అనారోగ్యంతో చెన్నై అపోలో హాస్పిటల్‌లో ఆకస్మాత్తుగా మరణించడం శోచనీయమని పేర్కొన్నారు. వీరు నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్‌గా నెల్లూరులో దాదాపు 34సంవత్సరాలు పనిచేశారని తెలిపారు. ఎయిడ్స్ పై అవగాహన కలిగించే ప్రత్యేక ప్రాజెక్ట్‌ను మంజూరు చేయించి బాధితులకు సహాయం అందించారని తెలిపారు. యువ జనులకు కావలసిన సహకారాన్ని అందించడంలో, నైతిక విలువలు పెంపొందించడంలో ముందుండేవారని పేర్కొన్నారు.



సుధాకర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న డా॥ ఈదూరు సుధాకర్

కార్యక్రమంలో రాష్ట్ర జర్నలిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జయప్రకాష్, రెడ్‌క్రాస్ రక్తనిధి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ డి. పెంచలసుబ్బయ్య, స్టాటిక్స్ సెంటర్ ప్రిన్సిపాల్ జి.మాధురి, క్యాషియర్ సి. హెచ్.రామాంజనేయులు, డిసాస్టర్ విభాగం సిబ్బంది స్వాములు, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీనేతాజీలో గురుపూజోత్సవం



డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన సందర్భంగా ఈ నెల 5న నెల్లూరు శ్రీనివాస అగ్రహారంలోని శ్రీనేతాజీ పైలట్ హైస్కూలులో ఉపాధ్యాయ దినోత్సవం విభిన్నరీతిలో నిర్వహించారు. స్కూలు కరస్పాండెంట్ యం.వి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రీన్ ఇండియా సంస్థ అధ్యక్షులు సి. హెచ్.వరదయ్య విద్యార్థులకు ప్రకృతిలో పచ్చదనం, మొక్కల విశిష్టతను తెలిపారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుండి రాష్ట్రపతి స్థాయి వరకు ఎలా ఎదిగారో వివరించి, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు కావున విద్యార్థులకు మొక్కలను సంరక్షించమని సూచిస్తూ బాధ్యత అప్పగించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు దేవసేన, సిహెచ్ లక్ష్మీదేవి, ఎన్ఎల్‌పి మోటివేటర్ కర్లపూడి కృష్ణయ్య, సిహెచ్ వరదయ్యలను ఘనంగా సత్కరించారు. స్కూలు డైరెక్టర్ నరేంద్రరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ వాణి, ప్రధానోపాధ్యాయులు శ్రీమతి ప్రసన్న, సుధాకర్‌రావు, అనీగ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతకు ప్రతీక ఎల్ఐసి

**• • • • • • • • • • • • • • • విఎస్‌యు రిజిస్ట్రార్ నాగేంద్రప్రసాద్**

భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) నిబద్ధతకు ప్రతీకగా నిలచిన సంస్థని, కోట్లాదిమందికి జీవితబీమా కల్పిస్తోందని, 'మీ క్షేమం-మా బాధ్యత' అనే నినాదంతో పనిచేసే ఈ ఎల్ఐసిలో ప్రతిఒక్కరూ పాలసీదారులుగా వుండడం ఎంతో శ్రేయోదాయకమని విఎస్‌యు రిజిస్ట్రార్ ఎ.నాగేంద్రప్రసాద్ అన్నారు. నెల్లూరులోని స్వర్ణవేదిక కళ్యాణ మండపంలో ఇటీవల జరిగిన 58వ బీమా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆర్థిక రంగంలో నమ్మకం ఎంతో ముఖ్యమైనదని, అలాంటి నిబద్ధతకు ఎల్ఐసి నిదర్శనమన్నారు. ఎల్ఐసి నెల్లూరు సీనియర్ డివిజనల్ మేనేజర్ పి.రమేష్‌బాబు, మార్కెటింగ్ మేనేజర్ సి.బాలయ్యచౌదరి తదితరులు పాల్గొని ఎల్ఐసి సేవలను, విశిష్టతలను వివరించారు. ఈ సందర్భంగా పదేళ్ళపాటు వరుసగా ఎండిఆర్‌టి సమావేశానికి అర్హత సాధించిన నాయుడుపేట బ్రాంచ్ ఏజెంట్ బాల సుబ్రహ్మణ్యంను, మరికొంతమంది ప్రముఖులను ఘనంగా సత్కరించారు. తొలుత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

# ఉపాధ్యాయులకు స్ఫూర్తిప్రదాత డా॥ రాధాకృష్ణన్




నెల్లూరు కొండాయపాళెంరోడ్డులోగల వాత్సల్య సేవా సంస్థ నిర్వహిస్తున్న భారతీయ విద్యావికాస్ హైస్కూలులో ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం స్ఫూర్తిదాయకంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వియస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ పిల్లల అభివృద్ధికి, తద్వారా దేశాభివృద్ధికి పాటుపడటంలో ఉపాధ్యాయులు ముఖ్యపాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను నేటి ఉపాధ్యాయులు స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని కోరారు. భారతీయ విద్యావికాస్ స్కూలు చాలాచక్కగా పనిచేస్తుందని, పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎంతో శ్రమిస్తుందని, ఈ ప్రయత్నం మరింత సఫలీకృతం కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను చూసి వారిని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా నెల్లూరు ధార్మిక పరిషత్ అధ్యక్షులు సి.వి.సుబ్రహ్మణ్యం స్కూలు అభివృద్ధి కోసం రూ.10,000/- వితరణ చేశారు. కార్యక్రమంలో జనహిత-వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డి, కరస్పాండెంట్ జి.వి.సాంబశివరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, వాత్సల్య సహాయకార్యదర్శి టి.వి.ఎస్. దుర్గాప్రసాద్, ఇ.సి.సభ్యులు బి.వి.ఎస్.బాబు, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.జయప్రకాష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భవిష్యత్ లేని 'భవిత' కేంద్రం

నెల్లూరు నగరంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన "భవిత" కేంద్రం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రత్యేకావసరాల పిల్లలకు విద్యను అందిస్తూ ఫిజియోథెరఫీ చేయాల్సిన భవితకేంద్రంలో పిల్లలకు తగిన ఉపకరణాలు, ఫిజియోథెరఫీకి అవసరమైన పరికరాలు లేకపోవడంతో కార్యకలాపాలు నామమాత్రంగా సాగుతున్నాయి. ప్రత్యేకావసరాల పిల్లల్లో పదిరకాలవారు ఉంటారు. వినికిడిలోపం, అంధత్వం, బుద్ధి మాంద్యం, అంగవైకల్యం, మూగ, వివిధ శారీరక లోపాలు కలిగిన పిల్లలకు భవిత కేంద్రం తోడ్పాటును అందించాల్సివుంది. అర్బన్, రూరల్ ప్రాంతాలకు సంబంధించి భవిత కేంద్రంలో ప్రత్యేకావసరాల పిల్లల పాఠశాల, నారాయణరెడ్డిపేటలోని ప్రాథమిక పాఠశాలలో ఇదే తరహా ప్రత్యేకావసరాల పిల్లల పాఠశాల కొనసాగుతున్నాయి. కాని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య స్వల్పం. ఒక్కో పాఠశాలలో ఇద్దరు రిసోర్స్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉండాల్సివుండగా ఒక్కరే విధుల్లో ఉంటున్నట్లు సమాచారం. ఇదిలావుంటే ప్రత్యేకావసరాల పిల్లలకు అందజేయాల్సిన ట్రైసైకిళ్లు, అంధ విద్యార్థులకు అవసరమైన బ్రెయిలీ లిపి పుస్తకాలు భవిత కేంద్రంలో మూలనపడి వున్నాయి. వీటిని పంపిణీ చేసే విషయంలో జాప్యం జరుగుతోంది. వీటన్నింటిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

# విజయడెయిరీలో ఎన్నికలు

నెల్లూరు విజయ డెయిరీ డైరెక్టర్ల ఎన్నికలు బుధవారం జరిగాయి. డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీఛైర్మెన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి వర్గాల మధ్య పోటీ జరిగింది. మొత్తం 131 సొసైటీ అధ్యక్ష ఓట్లు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో ఆరు మంది పోటీ చేశారు. ఎన్నికల అధికారిగా నంద్యాల వరదారెడ్డి వ్యవహరించారు. అభ్యర్థులుగా అన్నంరెడ్డి వరదారెడ్డి, వరదారెడ్డి కృష్ణారెడ్డి, ముంగర రవీంద్రబాబు, ఇసనాక సునీల్‌రెడ్డి, పద్దిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏలూరు అంజయ్యనాయుడు పోటీలో నిలిచారు. టీడీపీకి చెందిన అన్నంరెడ్డి వరదారెడ్డికి 93ఓట్లు, ఏలూరు అంజయ్యనాయుడుకు 83ఓట్లు, వైయస్సార్సీపీకి చెందిన ముంగర రవీంద్రబాబుకు 65ఓట్లు రాగా వీరి ముగ్గురు డైరెక్టర్లుగా ఎంపికైనట్లు అధికారికంగా ప్రకటించారు.




సికిందరాబాద్‌లో గల బన్సీలాల్‌పేటలోగల గవర్నమెంట్ బాలికల పాఠశాలలో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా గుర్తింపు పొందిన నెల్లూరు జిల్లా అల్లూరు కోడలు ఆర్.పద్మలతను ఎమ్మెల్సీ జనార్ధన్‌రెడ్డి, అదనపు జె.సి. సంజీవయ్య, విద్యాశాఖ ఆర్‌జెడి మస్తానయ్య, డిఇఓ సోమిరెడ్డిలు ఈ నెల 5న దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

# రాజుకుంటున్న రాయలసీమ

(మొదటిపేజీ తరువాయి)

జరిగే పోరాటం గాలిబుడగలా తేలిపోకుండా అనునిత్యం జరిగేలా ప్లాన్ చేస్తున్నారు. కర్నూలు, కడప జిల్లాలకు చెందిన కొందరు మేధావులు దీనికి నడుం కడుతున్నారు. రాయలసీమలో బ్రతుకు అవకాశాలు తక్కువ. పంటలు సరిగా పండవు. వ్యాపారాలతో పాటు కూలీ పనులు కోసం కూడా సీమవాసులు నగరాలకు వలస పోతుంటారు. హైదరాబాద్ రాజధాని అయ్యాక సీమ వాసులెందరో అక్కడ స్థిరపడ్డారు. ఇప్పుడు ప్రత్యేక తెలంగాణ రావడంతో అక్కడ వారి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఇటు సొంత రాష్ట్ర రాజధానిని చూస్తే విజయవాడలో పెట్టారు. అక్కడ ఒక అంకణం స్థలం కొనలేరు. బయట ప్రాంతాలవాళ్లు అక్కడికెళ్లి బ్రతకలేరు. ఇతర ప్రాంతాల ప్రజలను ఆదరించే గొప్పగుణం కూడా ఆ ప్రాంతంలో కనిపించదు. ఏ ప్రాంతం వారినైనా ఆహ్వానించి ఆదరించే గుణం ఒక్క నెల్లూరు జిల్లాలోనే కనిపిస్తుంది. అందుకే రాయలసీమ మేధావులు నెల్లూరును రాజధానిగా చేసుకుంటూ నెల్లూరు, ప్రకాశంజిల్లాలను కలుపుకుని గ్రేటర్ రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా సాధించుకోవాలనే దిశగా పోరాటానికి సంసిద్ధమవుతున్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో సముద్రతీరం వుంది, పోర్టులున్నాయి. ఈ రెండు జిల్లాలను పారిశ్రామిక కేంద్రాలుగా మార్చుకోవచ్చు. శ్రీశైలం డ్యాం వంటి జలనిధి ఉంది. ఇక తిరుపతి వెంకన్న వంటి ప్రపంచ క్షేత్రంతో పాటు శ్రీశైలం మల్లన్న ఉన్నాడు. ఆధ్యాత్మికంగా పెద్ద క్షేత్రాలకు కొరత లేదు. పర్యాటకంగా దిగులు లేదు. కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో భూగర్భ నిక్షేపాలు అపారంగా ఉన్నాయి. కాబట్టి విజయవాడ వాళ్ళ మోచేతి నీళ్లు తాగడం కంటే సొంతంగా స్వతంత్రంగా బ్రతుకుదామనే ఆలోచనతోనే మరో ఉద్యమానికి రాయలసీమవాసులు ఉద్యుక్తులవుతున్నారు.

మునుపటి ఆంధ్రప్రదేశ్ మూడు జోన్‌ల కలయికగా ఉండేది. తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర. ఈ మూడు జోన్‌లు కూడా భాషాపరంగా ఒకే దారంలో బంధించబడినప్పటికి అభివృద్ధి, సంస్కృతి, వ్యవహారాలు, స్థానిక పరిస్థితుల పరంగా వేర్వేరుగా ఉండేవి. కోస్తాంధ్ర వారితో పడకే తెలంగాణవాళ్లు ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని రేపి చివరకు దానిని సాధించుకున్నారు.

రాష్ట్ర విభజన తర్వాత మిగిలిన ఆంధ్రప్రదేశ్‌లో కోస్తా, రాయలసీమలు మిగిలాయి. ఇప్పుడు రాజధాని ఎంపిక విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఏకపక్ష నిర్ణయం మూలంగా రాయలసీమలో మరో ప్రాంతీయ ఉద్యమం పురుడుపోసుకునే అవకాశం కనిపిస్తోంది. రాయలసీమలో చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం... నాలుగు జిల్లాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన మొదట్లోనే కర్నూలు రాజధానిగా ఉండేది. దానిని హైదరాబాద్‌కు మార్చబట్టే ఇప్పుడీ సమస్యలన్నీ వచ్చాయి. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు కర్నూలునే రాజధాని చేయాలని రాయలసీమవాసులు డిమాండ్ చేస్తున్నారు. విభజన బిల్లు రూపొందించేటప్పుడైతే అనంతపురం, కర్నూలు జిల్లాలను కలుపుతూ రాయలతెలంగాణ అంశాన్ని తెరమీదకు తేవడం జరిగింది. రాయలసీమలో ఏ ప్రాంతాన్ని కూడా రాజధాని కోసం కనీసం ఆలోచన చెయ్యలేదు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సామాజికవర్గం కోణంలోనే ఆలోచించి కృష్ణా, గుంటూరు జిల్లాలను మాత్రమే రాజధానికి పరిశీలనలోకి తీసుకుంది. రాయలసీమ జిల్లాలకు అందుబాటులో ఉండేలా ప్రకాశం లేదా నెల్లూరుజిల్లాలను రాజధానికి పరిశీలించి వున్నా రాయలసీమ వాళ్ళు సంతృప్తి చెందేవాళ్లు. వారికి ఏ మాత్రం అందుబాటులో లేని ప్రాంతాలను రాజధానికి ఎంపిక చేయడం వారికి ఏ మాత్రం మింగుడుపడడం లేదు. రాజధానికి ఎంపికచేసిన ప్రాంతంలో రాయలసీమవాసులు ఇమడలేరు. రాష్ట్ర ప్రభుత్వం రాజధాని ఎంపికలో పక్షపాతంగా, ఏకపక్షంగా వ్యవహరించడం ద్వారా రాయలసీమలో మరో వేర్పాటువాద ఉద్యమానికి చిచ్చుపెట్టినట్లయ్యింది.

# గొంతు కోస్తా... పాతిపెడతా!

(మొదటిపేజీ తరువాయి)

వార్తలుండాలన్నట్లు శాసిస్తున్నాడు. ఇప్పటికే తెలంగాణలో టీవీ9, ఏబిఎన్ టీవీ ఛానెల్స్‌ను ఎంఎస్‌ఓల ద్వారా ఆపి వేయించాడు. ఈ రెండు ఛానెల్స్ ప్రసారాల పునరుద్ధరణకు కేంద్రం జోక్యం చేసుకున్నా కేసీఆర్ వినలేదు. ఛానెల్స్ ప్రసారాలను పునరుద్ధరించాలంటూ విలేకరులు ధర్నాకు దిగితే వారిని అరెస్ట్ చేయించారు.

9వ తేదీ వరంగల్‌లో జరిగిన ఓ సభలో మీడియానుద్దేశించి కేసీఆర్ చేసిన హెచ్చరికలతో మొత్తం పత్రికా ప్రపంచమే నివ్వెరపోయింది. తెలంగాణలో బతకాలంటే మాకు సెల్యూట్ కొట్టాల్సిందే... లేకుంటే పదికిలోమీటర్ల లోతున పాతరేస్తాం... మెడలు విరిచేస్తాం అంటూ ఆయన హెచ్చరించాడు. ఈ మాటలు విని సభ్యసమాజమే నోరెళ్ల బెట్టింది. మనం ప్రజాస్వామ్య దేశంలో వున్నామో, నియంతల పాలనలో ఉన్నామో కూడా అర్థం కాని పరిస్థితి.

కేసీఆర్ వ్యాఖ్యలపై జాతీయ, అంతర్జాతీయ మీడియా తీవ్రంగా మండిపడింది. ఆయనను హిట్లర్, నరహంతకుడితో పోల్చాయి. అన్ని జాతీయ ఛానెల్లు కూడా కేసీఆర్ కారుకూతలపై ప్రత్యేక కథనాలతో దుయ్యబట్టాయి. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌ను హీరోను చేసింది, తెలంగాణ ఉద్యమానికి అంతర్జాతీయంగా ప్రాచుర్యం కల్పించింది, తెలంగాణ ఏర్పడడానికి కారణమైంది మీడియానే! అదే మీడియాపై ఈరోజు కేసీఆర్ దాడికి తెగబడ్డాడు. ప్రజాస్వామ్య చరిత్రలో ఇలాంటి నియంతలకు స్థానం లేదు. కేసీఆర్ రాజకీయ బ్రతుకు తొందర్లోనే గబ్బు పట్టడం ఖాయం.

# స్మగ్లర్లకు టెర్రర్... గూండాలకు హర్రర్

(మొదటిపేజీ తరువాయి)

విధంగా తడుస్తుంటే, ఆయన పెట్టే పనితో పరుగులు తీయలేక పోలీసుల చొక్కాలు చెమటతో తడుస్తున్నాయి. చాలాకాలానికి నెల్లూరుకు కరెక్ట్ ఆఫీసర్ తగిలాడు. కాంగ్రెస్ ప్రభుత్వమున్న పదేళ్లకాలంలో వారి ఏజెంట్లులాంటి ఎస్పీలను చూడాల్సి వచ్చింది. వచ్చిన వాళ్లందరూ ఎస్ఐకు ఎక్కువ ఎస్పీకి తక్కువ లాంటి పోలీసు అధికారులే!

ఇక్కడకు రాకముందు వరకు అనంతపురం జిల్లా ఎస్పీగా పనిచేసిన సెంథిల్ కుమార్ గురించి తెలుగుదేశం నాయకులకు బాగా తెలుసు. అందుకే ఆయన నెల్లూరుజిల్లా ఎస్పీగా వస్తున్నాడంటే రాకుండా చేయడానికి స్థానిక నాయకులు బలంగానే ప్రయత్నించారు. కాని ఈ ఒత్తిళ్లకు లొంగకుండా చంద్రబాబు అతనిని నెల్లూరుజిల్లాకు ఎస్పీగా పంపించి మంచి పని చేశారు. జిల్లాలో పోలీసులు పనిచేస్తున్న వాతావరణం చాలా ఏళ్ల తర్వాత కనిపిస్తుంది.

ముఖ్యంగా పోలీసులు స్మగ్లర్ల భరతం పడుతున్నారు. అక్రమ రవాణాకు కళ్లెం పడింది. నెల్లూరు నుండి చెన్నైకు అక్రమ రవాణా దశాబ్దాల కాలంగా సాగుతుంది. ఏ పోలీసు అధికారి కూడా దీనిని అరికట్టే ప్రయత్నం చేయలేదు. బియ్యం, మినుము వంటి వాటితో పాటు ఇతర వస్తువులు కూడా ఎటువంటి పన్నులు చెల్లించకుండానే రవాణా అయ్యేవి. ఇక ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డే లేదు. స్మగ్లర్లకు పోలీసులతో పాటు అన్ని ప్రభుత్వశాఖల సిబ్బందితో ఆమ్యామ్యా సంబంధాలుంటాయి. ఎవరికి కొట్టాల్సింది వారికి కొడుతూ స్మగ్లర్లు తమ పనులు నిర్విఘ్నంగా కానిస్తూ వచ్చారు. ఈ అక్రమరవాణాకే 'జాక్‌పాట్ బిజినెస్' అని నెల్లూరులో పేరు కూడా వుంది. ఒకర్ని చూసి ఒకరు... ఇలా అక్రమ వ్యాపారులు పెరుగుతూ వచ్చారు. పెరుగుతున్న అక్రమరవాణాకు కళ్లెం వేయడానికి ఇటీవల హైవే మీద విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పోలీసుల తనిఖీలలో భారీగానే అక్రమ రవాణా లారీలు పట్టుబడ్డాయి. వీటిని విడిపించుకోవడానికి స్మగ్లర్లే కాదు, అధికారపార్టీ నాయకులు కూడా నానా తిప్పలు పడ్డారు. మంత్రి స్థాయిలో సిఫార్సులు చేయించారు. ఎస్పీ ఏ మాత్రం తగ్గలేదు.

ఒక్క స్మగ్లర్లకే కాదు, అన్ని రకాల అరాచకశక్తులకు సింహస్వప్నంలా తయారయ్యాడు సెంథిల్‌కుమార్. ఎస్పీ స్పీడుకు పరుగులు తీయలేక రొప్పుతున్నారు పోలీసు సిబ్బంది. ఇంతకుముందు నెల్లూరులో సిఐ, డిఎస్పీ, ఎస్ఐల పోస్టుల కోసం పోటీలు పడేవాళ్లు. ఇప్పుడు ఎస్పీ దెబ్బకు నెల్లూరులోగా పోస్టింగ్ వద్దే వద్దంటున్నారు. ఒక పోలీసు ఆఫీసర్ చిత్తశుద్ధితో పనిచేస్తే మార్పు ఎంతగా ఉంటుందో ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాము.

జిల్లా ఎస్పీ పనితీరుపై ఓ పక్క ప్రశంసలు కురుస్తున్నాయి. ప్రజలు కూడా ఆయన పనితీరుపట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంకో పక్క అధికారపార్టీ నాయకులకు మాత్రం ఆయన మింగుడు పడడంలేదు. దీంతో ఆయన బదిలీకి ప్రయత్నాలు చేస్తున్నారు.

# బ్రహ్మానందంను గుర్తు చేసుకున్న ఎమ్మెల్యేలు

గల్పిక

పదిహేనేళ్ల క్రితం వచ్చిన ఓ తెలుగు సినిమాలో సన్నివేశం ఇది. మల్లిఖార్జునరావు లాయర్. తన కుటుంబసభ్యులకు ఆస్తి పంపకాలు చేయాలని బ్రహ్మానందం మల్లిఖార్జునరావు వద్దకు వస్తాడు. మల్లిఖార్జునరావు ఆస్థి వివరాలను చెప్పమంటాడు. బ్రహ్మానందం ఇలా చెప్ప సాగాడు... ఊర్లో వంద ఎకరాల కొబ్బరితోట భార్యకు, 50ఎకరాల మామిడి తోట పెద్ద కొడుక్కి, 60ఎకరాల చేపలచెరువు చిన్నకొడుక్కి, రెండంతస్థుల మేడ సెకండ్ సెటప్‌కు... అని చెప్పుకుపోతుండగా, ఆస్తుల డాక్యుమెంట్లు ఎక్కడ ఉన్నాయని మల్లిఖార్జునరావు అడుగుతాడు. అవన్నీ నా దగ్గరెక్కడ ఉన్నాయి, ఆ ఆస్థులన్నీ ఇప్పుడు సంపాదించాలని బ్రహ్మానందం అంటాడు. మల్లి ఖార్జునరావు నోరెళ్లబెడతాడు.

★★★★★

అది తెలంగాణ సీఎం దయాదాక్షిణ్యాలతో హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నడుపు కుంటున్న అసెంబ్లీ భవనం. ఏపి శాసనసభ సమావేశాలు జరుగుతున్నాయి. ఆరోజు సభలో హైటెక్‌రత్న, సిఎం చంద్రబాబు రాజధానిపై ప్రకటన చేయబోతున్నాడు. దాంతో సభ్యులలో కొంత ఉత్కంఠ నెలకొంది. సభ్యులందరూ వచ్చి తమ స్థానాలలో కూర్చున్నారు. స్పీకర్ కోడెల శివప్రసాద్ అప్పుడే లోపలకు వచ్చాడు. ఆయన నేరుగా వెళ్లి తెలుగుదేశం సభ్యుల పక్కన కూర్చున్నాడు. అది చూసి జగన్... సార్ కరెక్ట్ ప్లేస్‌లో కూర్చున్నాడు. ఆయన అక్కడికంటే ఇక్కడ కూర్చోవడమే బెటర్ అని ఎద్దేవా చేశాడు. వెంటనే చంద్రబాబు... శివప్రసాద్ గారు... మీరు కూర్చోవాల్సింది అక్కడ, ఇక్కడ కాదు అంటూ సభాపతి స్థానం వైపు చూపించారు. అప్పుడు కోడెల నాలిక్కరుచుకుని అలవాటులో పొరపాటయ్యింది, అయినా నాకు అక్కడ కూర్చోవడం కంటే ఇక్కడ కూర్చోవడమే హాయనిపిస్తుంది. ఏం చేసేది నా ఖర్మ అని తల కొట్టుకుంటూ వెళ్లి సభాపతి స్థానంలో కూర్చున్నాడు. సభ మొదలైంది. ప్రతిపక్షనేత జగన్ లేచి... అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ఈరోజు రాజధాని పై ప్రకటన చేస్తానని దానికి ముహూర్తం కూడా పెట్టించుకున్నారు. రాజధానిపై అసెంబ్లీలో చర్చ జరగకుండానే ఎలా ప్రకటిస్తారు అధ్యక్షా అని ప్రశ్నించాడు. అప్పుడు చంద్రబాబు లేచి... అధ్యక్షా! కోడి ముందా, గుడ్డు ముందా అనే ప్రశ్నకు ఏ సమాధానమైనా ఒకటే! ఆ రెండూ కూడా మనం తినడానికే! అలాగే రాజధానిపై ముందు చర్చ జరిగినా, వెనుక చర్చ జరిగినా వచ్చే పేరు ఒకటే! సభలో రోజుల తరబడి చర్చ జరిగినా రాజధాని పేరు మారేదేమీ లేదు. మైండ్‌లో ఒకసారి ఫిక్సయ్యానంటే బ్లైండ్‌గా పోతాను, ఒక్కసారి కమిట్ అయ్యానంటే నా భార్య మాట కూడా వినను అని చెప్పాడు. అప్పుడు స్పీకర్ కోడెల... ఈ ప్రతిపక్షా లోళ్లకు ఏం పనీపాటా లేకుండా వాగుతుంటారులే సీఎం గారు, మీరు లేచి చదవండి అని చెప్పాడు. చంద్రబాబు లేచి చదవసాగాడు. ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా విజయవాడను ప్రకటిస్తున్నాను. మన నూతన రాజధానిని సింగపూర్, పుత్రజయ, ఇస్లామాబాద్, చికాగో, సిడ్నీ, దుబాయ్‌లలో దేనిలాగా తయారు చేయాలో లక్కీడిప్ ద్వారా నిర్ణయిస్తాం. అంటే నగరాల పేర్లన్నీ చీటీలమీద వేసి లాటరీ తీస్తామన్నమాట. ఇక రాష్ట్రంలో మరో మూడు మెగా సిటీలను నిర్మిస్తాం, అవి కూడా ఏ నగరంలో ఉండా లనేది లక్కీడిప్‌లోనే నిర్ణయించడం జరుగుతుంది. ఇక జిల్లాలవారీగా చూస్తే విశాఖకు ఫిలిం ఇండస్ట్రీ, ఐఐఎం, రైల్వేజోన్, ఈస్ట్‌గోదావరిలో పెట్రోల్ వర్శిటీ, ఐటి హబ్, వెస్ట్ గోదావరిలో ఆక్వా యూనివర్శిటీ, ఆయిల్ పరిశ్రమ, కడపలో స్టీల్‌ప్లాంట్, చిత్తూరులో ఐఐటి, ప్రకాశంలో మైనింగ్ వర్శిటీ, గుంటూరులో అగ్రికల్చర్ యూనివర్శిటీ, అనంతపురంలో నాలెడ్జ్ సెంటర్, నెల్లూరుకు ఇఫ్కో... ఇక ప్రతి జిల్లాలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు... అని చెప్పుకుంటూ పోతుండగా అనంతపురం జిల్లాకు చెందిన ఎమ్మెల్యే జె.సి.ప్రభాకర్‌రెడ్డి లేచి... అన్ని జిల్లాల్లో పోర్టులు నిర్మిస్తామంటున్నారు, మా జిల్లాకు ఏమిస్తారు అని అడిగాడు. దానికి చంద్రబాబు... మీ జిల్లాలో కూడా పోర్టు నిర్మిస్తామని అన్నాడు. అందుకు అదే జిల్లాకు చెందిన మంత్రి పల్లె రఘునాథరెడ్డి వుండి... పోర్టు నిర్మించడానికి మా జిల్లాలో సముద్రం లేదు సీఎం గారు అని విన్నవించుకున్నాడు. వెంటనే చంద్రబాబు... కేంద్రంతో మాట్లాడి మీ జిల్లాలో సముద్రం ఏర్పాటు చేసాకే పోర్టు నిర్మాణం చేపడుతామని చెప్పాడు. వెంటనే చిత్తూరుజిల్లా ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ లేచి... చిత్తూరుజిల్లాకు కూడా ఒక పోర్టు కావాలి సార్ అని అడిగాడు. దానికి చంద్రబాబు... చిత్తూరుజిల్లాలో సముద్రం లేదనే సంగతి నాకు తెలుసు... కాబట్టి అక్కడ కూడా సముద్రం వచ్చాక పోర్టు నిర్మాణం చేపడుతామన్నారు. అప్పుడు మున్సిపల్ మంత్రి నారాయణ లేచి... అధ్యక్షా! చంద్రబాబు గారు వరాలజల్లులు కురిపిస్తుంటే అందరి మనసులు గాల్లో తేలిపోతున్నాయి. ఆయన మాటలు వింటుంటే స్వర్గంలో ఉన్నట్లుగా వుంది. ఆయన ప్రసంగానికి ఎవరూ అడ్డు తగలొద్దు... ఆయన నోటి నుండి వచ్చే వరాల అమృతధారను అందరం ఆస్వాదిద్దాం అని చెప్పాడు. అప్పుడు చంద్రబాబు వరాల వానను కంటిన్యూ చేస్తూ... రాష్ట్రంలో 13స్మార్ట్‌సిటీ లుంటాయి, ప్రతి ఊరికి ఎయిర్‌పోర్టు పెడదాం.. హైస్పీడ్ రైళ్లు వస్తాయి. గ్రామాలకెళ్లే రోడ్లను ఎనిమిదిలైన్ల రోడ్లుగా మారుస్తాం. ప్రతి విద్యార్థికి ల్యాప్‌టాప్, ప్రతి వ్యక్తికి ఒక కారు ఉండేలా చేస్తాం. ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ పెడదాం. ఇంట్లోకి కావాల్సిన కూరగాయలు కూడా ఇంటర్నెట్‌లో మెయిల్ పెట్టి తెప్పించుకోవచ్చు. ప్రతి ఒక్కరికీ ఏటిఎం కార్డులిస్తాం, ఎంత డబ్బు కావాలంటే అంత డబ్బు డ్రా చేసుకుంటుండొచ్చు. ప్రతి పేదవాడికీ నాలుగు బెడ్‌రూంల ఇల్లు కట్టిస్తాం. పట్టణాలను, గ్రామాలను కలుపుతూ ఫ్లైఓవర్‌లు నిర్మిస్తాం. రాష్ట్రంలోని ప్రతి ఊరి నుండి రాజధాని విజయ వాడకు విమాన సర్వీసులు నడుపుతాం అని చెపు తుండగా, మధ్యలో జగన్ లేచి... అధ్యక్షా! ఇవన్నీ వింటుంటే నాకు 'కోతలరాయుడు' సినిమా చూస్తున్నట్లుగా ఉంది. అసలు ఆయన చెప్పినవన్నీ చేయడానికి మనవద్ద నిధులున్నాయా? అని ప్రశ్నించాడు. వెంటనే చంద్రబాబు... వాటికి డబ్బులెక్కడున్నాయి. ఇవన్నీ కూడా డబ్బులు సంపాదించాక చేయాలనుకుంటున్న పనులు అని ఒక్క మాటలో చెప్పేసాడు. దాంతో అందరికీ బ్రహ్మానందం, మల్లిఖార్జునరావుల సన్నివేశం కళ్లముందు మెదిలింది.

కదంబం

## ఒంటరిని అనుకోను

బొగ్గరపు రాధాకృష్ణమూర్తి
నెల్లూరు. 9885481939

కాలం ఒలకబోసిన నీళ్ళు
కులకాలం పులకరిస్తూనే వున్నాయి
గతంలోకి వెళ్ళి వస్తున్న కళ్ళు
అనుభూతుల దృశ్యాల్ని చూస్తూనే వున్నాయి...
నేనున్న చోటే ప్రపంచమంతా
పరుచుకున్నట్లుగా వుంటుంది
నా ఉనికి చుట్టే లోకమంతా
తిరుగుతున్నట్లుగా తోస్తుంది...
నిరంతరం నన్ను నేను తెలుసుకునే
ప్రయత్నంలో తృప్తి పొందుతుంటా
అనుక్షణం ప్రకృతిలో కలిసిపోయే
ప్రమోదంలో ఆర్తినందుకుంటా...
నేనెప్పుడూ ఒంటరిని అనుకోను
అలాగని సమూహంలోనూ వుండను
నేనెక్కడా గుర్తింపును కోరుకోను
అయినా 'నేను'గా వుండాలనుకుంటాను...
కొన్ని సంఘటనలు నిరుత్సాహాన్నిస్తే
ఇంకొన్ని ఘటనలు నిరుత్తరుణ్ని చేశాయి
వర్తమానంలో అప్రమత్తంగా వుంటున్నా
జీవితాన్ని నిమిత్తమాత్రంగానే చూస్తాను...
బ్రతుకులో బంధాలకు పట్టుబడినా
కన్నీళ్ళ తాళ్ళకు కట్టుబడలేదు
అందరూ నా దగ్గరికి వస్తారు
కొందరే నా లోపలికి చూస్తారు
నా గమనం అత్యంత సాధారణం
జీవితగీతాలాపనలో
నా మననం రోజూ మారే చరణం...

## విశిష్ట కథకులు.. పాలగుమ్మి పద్మరాజు

తెలుగు కథకు అంతర్జాతీయ గుర్తింపును, విఖ్యాతిని తెచ్చిన ఘనత ప్రఖ్యాత రచయిత పాలగుమ్మి పద్మరాజుకే దక్కుతుందని ప్రముఖ కథారచయిత్రి డాక్టర్ జయప్రద కొనియాడారు. ఈ నెల 7న సాహితీమిత్రమండలి ఆధ్వర్యంలో పాలగుమ్మి పద్మరాజు శతజయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాలగుమ్మి పద్మరాజు విశిష్ట కథకులని, తెలుగు కథకు సమున్నతమైన స్థానాన్ని సాధించిపెట్టారని ఆమె ప్రశంసించారు. ప్రముఖ సాహితీవేత్తలు కాళిదాసు పురుషోత్తం, త్వరకవి బాలకృష్ణమూర్తి, హెచ్‌ఎస్‌వికె రంగారావు, ప్రముఖ కవులు చిన్ని నారాయణరావు, డాక్టర్ ఈదూరు సుధాకర్, ఈతకోట సుబ్బారావు, ఏటూరి నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నతవిలువల జాజిమల్లి.. సర్వేపల్లి




సభలో మాట్లాడుతున్న బి.వి.నరసింహం

నెల్లూరు కొండాయపాళెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 5న సింహపురి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ జి.బాబూరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ డా॥ ఈదూరు సుధాకర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదుపరి ఆయన మాట్లాడుతూ అతి సామాన్య కుటుంబంలో జన్మించి ఉపాధ్యాయుని స్థానానికే వన్నె తెచ్చేవిధంగా గౌరవం పొంది, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి రాష్ట్రపతిగా ఉన్నతమైన విలువలు సాధించిన మహామనీషి డా॥ రాధాకృష్ణన్ అని కొని యాడారు. అతిథిగా పాల్గొన్న సహస్రసభా సింహం బి.వి.నరసింహం మాట్లా డుతూ సమాజానికి దిశానిర్దేశాన్ని చేసేది గురువులేనని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ప్రధానో పాధ్యాయులు భాస్కర్‌రావును ఉత్తమ ఉపాధ్యాయులుగా ట్రస్ట్ తరపున గౌరవపూర్వకంగా సత్కారం చేశారు. కార్యక్రమంలో అడ్వకేట్ ఎన్.నాగబాబు యాదవ్, కొండాపురం వెంకటేశ్వర్లు, కందికట్టు వేమయ్య, డి.ఇందిర, శ్రీధర్, శంకరయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## డా॥ కె.జి.వేణుకు డా॥ రాధేయ కవితాపురస్కారం

డా॥ రాధేయ కవితాపురస్కారానికి సంబంధించి ప్రధాన అవార్డుకు డా॥ కె.జి.వేణు, ఉత్తమ కవితాఅవార్డుకు టి.సుధీర్‌కుమార్, బి.కళాగోపాల్‌లు ఎంపికైనట్లు నిర్వాహకులు పెళ్ళూరు సునీల్, ఎస్.గోపాలయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయనిర్ణేతలుగా కవులు ఆశారాజు, భగవాన్, ప్రొ॥ ఎస్.జి.పి.చంద్రశేఖర్‌లు వ్యవహరించారని తెలిపారు.


## గ్రామ పంచాయతీ కార్యాలయము : కలువాయి

ఆర్.సి.నెం.5/2014 తేది.08-09-2014

### టెండరు, వేలము ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా, కలువాయి మండలం, కలువాయి గ్రామ పంచాయతీ 2014-15 సం॥నకుగాను కలువాయి గ్రామ పంచాయితీ కార్యదర్శిగారిచే గాని లేదా వారు అనుమతి పొందిన వారిచేగానీ తేది 15.09.2014 ఉదయం 11గం॥లకు ఈ క్రింద చూపబడిన ఐటమ్‌లకు సీల్డ్‌వేసిన టెండర్లు స్వీకరించబడును అదే రోజు మధ్యాహ్నం 3.00గం॥లకు హాజరైన టెండరుదారుల సమక్షమున టెండర్లు తెరువబడును. టెండరు నందు పాల్గొనువారు ఈ క్రింద చూపబడిన ఐటమ్‌లకు వాటికి ఎదురుగా ధరావత్తులను ముందుగా చెల్లించి రశీదును టెండరుతో జతపరిచి పంపుకొనవలెను. ధరావత్తు చెల్లించని టెండర్లు నిరాకరించబడును. అదే రోజు మధ్యాహ్నం 4.00గ॥లకు ఈ క్రింద చూపబడిన ఐటమ్‌లకు వేలం పాటకు ఎదురుగా చూపబడిన ఐటమ్ ధరావత్తు చెల్లించి వేలంపాట యందు పాల్గొనవలెను. గ్రామ పంచాయితీకి పన్నులు, ఫీజులు రుసుములు వగైరా బాకీలు ఉన్నవారు పాట యందు పాల్గొనుటకు అనర్హులు. మిగతా వివరములకు కార్యాలయ పనివేళల యందు తెలుసుకొనవలెను.

| వ.నెం. | వస్తువు సరఫరా టెండరు వివరములు | ధరావత్తు(రూ.) |
|---|---|---|
| 1 | 2014-15 సం॥నకు స్టేషనరీ సామాన్లు సరఫరా చేయుట | 50-00 |
| 2 | 2014-15 సం॥నకు వీధి దీపములు కావలసిన విడిభాగములు సరఫరా చేయుట (శ్రీయుత జిల్లా కలెక్టర్ నెల్లూరు వారు ఇవ్వబడిన రేట్లు ప్రకారము) | 100-00 |
| 3 | 2014-15 సం॥నకు పబ్లిక్ హెల్త్ వస్తువులు మరియు బ్లీచింగ్, సున్నం, ఫినాయిల్ సప్లయ్ చేయుటకు | 50-00 |
| 4 | పంచాయతీ సిబ్బందికి యూనిఫారాలు సప్లయ్ చేయుటకు | 50-00 |
| 5 | పి.డబ్ల్యూ.యస్.స్కీం 5హెచ్.పి, 7హెచ్.పి సబ్ మెర్సిబుల్ మోటర్లు రివైండింగ్ సామాన్లు సప్లయ్ చేయుటకు | 50-00 |
| 6 | గ్రామ పంచాయతీ ఏరియా వీధులలోని చెత్త మరియు మట్టిదిన్నెలు ఊరికి తోలుటకు ట్రాక్టర్ సప్లయ్ చేయుటకు | 50-00 |

### కాంట్రాక్టు బేసిన్ పోస్టులు

| వ.నెం. | వివరములు |
|---|---|
| 1. | 2014-15సం॥నకు శానిటరీవర్కర్లుగా పనిచేయుటకు (2)పోస్టులు కాంట్రాక్టు పద్ధతిపై నెల1కి స్థిర జీతంపై పనిచేయుటకు శ్రీ జిల్లా కలెక్టరు(పంచాయతీ విభాగము) నెల్లూరు వారి ఉత్తర్వుల మేరకు. |
| 2. | 2014-15 సం॥నకు స్వీపర్లుగా పనిచేయుటకు (7)పోస్టులు కాంట్రాక్టు పద్ధతిపై నెల1కి స్థిరజీతంపై పనిచేయుటకు శ్రీ జిల్లా కలెక్టరు (పంచాయతీ విభాగము) నెల్లూరు వారి ఉత్తర్వుల మేరకు. |
| 3. | 2014-15సం॥నకు పి.డబ్ల్యూ.యస్ స్కీం పంపు ఆపరేటర్ (5)పోస్టులు కాంట్రాక్టు పద్ధతిపై నెల 1కి స్థిర జీతముపై పనిచేయుటకు శ్రీ జిల్లా కలెక్టరు(పంచాయతీ విభాగము) నెల్లూరు వారి ఉత్తర్వుల మేరకు. |
| 4. | 2014-15సం॥నకు వీధి లైట్లు వేయుటకు (2)పోస్టులు కాంట్రాక్టు పద్ధతిపై నెల 1కి స్థిరజీతముపై పని చేయుటకు శ్రీ జిల్లా కలెక్టరు(పంచాయతీ విభాగము) నెల్లూరు వారి ఉత్తర్వుల మేరకు. |
| 5. | 2014-15సం॥నకు కార్యదర్శి గారికి సహాయకునిగా పనిచేయుటకు 1పోస్టులు కాంట్రాక్టు పద్ధతిపై నెల 1కి స్థిర జీతముపై పనిచేయుటకు శ్రీ జిల్లా కలెక్టరు(పంచాయతీ విభాగము) నెల్లూరు ఉత్తర్వుల మేరకు. |
| 6. | 2014-15సం॥నకు బిల్ కలెక్టరు 1 పోస్టుకు కాంట్రాక్టు పద్ధతిపై నెల 1కి స్థిర జీతంపై పని చేయుటకు శ్రీ జిల్లా కలెక్టరు(పంచాయతీ విభాగము) నెల్లూరు ఉత్తర్వుల మేరకు. |

### వేలంపాట వివరములు

| వ.నెం. | వివరములు | ధరావత్తు |
|---|---|---|
| 1 | 2013-14సం॥రము యొక్క కాలిపోయిన ట్యూబులు, బల్బులు, చౌకులు వేలం వేయుట. | 100-00 |
| 2 | 2013-14 సం॥రము యొక్క పి.డబ్ల్యూ.యస్ స్కీం సామాన్లు వేలం వేయుట. | 100-00 |
| 3 | 2013-14సం॥రము యొక్క పాత న్యూస్‌పేపర్లు వేలం వేయుట. | 50-00 |

సం/- యు.రమేష్, పంచాయతీ కార్యదర్శి,
కలువాయి గ్రామపంచాయతీ, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరుజిల్లా.



నాయకుల ఆధిపత్యపోరుకు నెల్లూరు నగర కార్పొరేషన్ వేదికగా మారింది. రానురాను ఇది వివాదాల పుట్టగా తయారవుతోంది. నాయకుల మధ్య సఖ్యత లేక పోవడం, ఒకరంటే ఒకరికి గిట్టక పోవడం, ఒకరిపై ఒకరు ఉప్పు-నిప్పులాగా వుండడం సర్వసాధారణమైపోయింది.



# నాయకుల పంతాలు.. అధికారుల తంటాలు

## - - నెల్లూరు కార్పొరేషన్‌లో ఇదీ సంగతి - -

నాయకుల మధ్య రోజురోజుకీ పెరిగిపోతున్న పంతాలు.. పట్టింపులు చివరికి అధికారులకు తలబొప్పి కట్టిస్తున్నాయి. ఏ నాయకుడితో ఎలా వ్యవహరిస్తే ఏ ముప్పు దాపురిస్తుందోనని అధికారులు భయపడే దుస్థితి దాపురించింది. నెల్లూరు కార్పొరేషన్‌లో ప్రస్తుతం హాట్ టాపిక్ ఇదే.

నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, మేయర్ అబ్దుల్ అజీజ్ గతంలో వైఎస్సార్సీపికి చెందిన వారే. వైఎస్సార్సీపి నుంచి మేయర్‌గా గెలుపొందిన అజీజ్, ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో తెలుగుదేశంలోకి జంప్ కావడం, తానలా పార్టీ మారడానికి కారణం ఎమ్మెల్యే తీరేనంటూ కారాలు మిరియాలు నూరడంతో ఎమ్మెల్యే-మేయర్‌ల మధ్య వున్న వివాదాలు బట్టబయలయ్యాయి. ఇద్దరి మధ్యా మాటల యుద్ధం ప్రారంభమైంది. మంట పెద్దదై.. చివరికి ఒకరిమీద మరొకరు అగ్గిమీద గుగ్గిలంలా తయారయ్యారు. ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు ప్రారంభమైంది.

అసలు కార్పొరేషన్‌లో పనులు సక్రమంగా జరగడం లేదని, ప్రజల సమస్యలు తీర్చేందుకు అధికారులు గట్టి చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్యే మండిపడుతున్నారు. తాను ఎమ్మెల్యే కాబట్టి, తన వద్దకు అధికారులు వచ్చేందుకు ఎవరి అనుమతి తీసుకోనక్కర లేదని, మేయర్ ఆధిపత్యాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ, అధికారులు ఇకనైనా తీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే గట్టిగా చెప్తున్నారు. అంతేకాదు, తన సమావేశాలకు సంబంధిత కార్పొరేషన్ అధికారులు హాజరు కాకపోవడం ఏమిటంటూ ఆయన తీవ్ర అసంతృప్తితో వున్నారు. అయితే, నగరపాలక సంస్థ పరిధిలో తాను సూచించిన సమావేశాలకు మాత్రమే అధికారులు హాజరు కావాలని మేయర్ సూచిస్తుండడంతో, తమ పరిస్థితి అడకత్తెరలో పోకచెక్క పడినట్లుగా అయిందని, 'ఆయన రమ్మంటారు.. ఈయన పోవద్దంటారు.. మధ్యలో మేమేం చేయగలమంటూ' అధికారులు లోలోపలే మథనపడుతున్నట్లు సమాచారం.

### బదిలీలు, చేరికలకు రంగం సిద్ధం :

నెల్లూరు కార్పొరేషన్‌లో అధికారులు, కీలకమైన పోస్టుల్లో వున్నవారికి కొంతమందికి బదిలీలు తప్పవని అంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చేందుకు కొంతమంది అధికారులు కూడా రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలో, టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఈ మార్పులు జరుగనున్నట్లు తెలుస్తోంది. గతంలో పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీఅయి వెళ్ళినవారు కూడా ఇప్పుడు ఈ అదనుకోసం వేచి చూస్తున్నారు. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ ఈ జిల్లావాసి కావడం, కేంద్రంలో కీలకపాత్ర పోషిస్తున్న కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఎం. వెంకయ్యనాయుడు ఈ జిల్లా వాసి కావడంతో నెల్లూరు నగరం స్మార్ట్‌సిటీగా ఎంతో పురోభివృద్ధి చెందుతుందన్న ఆశలు అందరికీ వున్నాయి. ఈ నేపథ్యంలో నెల్లూరు కార్పొరేషన్‌కు నిధుల కొరత వుండదని అందరూ భావిస్తున్నారు. ఇక్కడ పనిచేసేందుకు, మంచి పోస్టుల్లో నియమితులయ్యేందుకు ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. నగర మేయర్ అబ్దుల్ అజీజ్ కూడా తన మాట వినే అధికారులను ఇక్కడికి రప్పించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. తనకు అనుకూలంగా వున్నవారిని తెచ్చుకుని, ఈ నెలాఖరులోగా ఆ మేరకు బదిలీల పర్వాన్ని ముగించేందుకు మేయర్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

### సమస్యల వలయంలో నెల్లూరు :

నగరం మురికికూపంగా మారిపోయి వుంది. కాలువల్లో చెత్తను సక్రమంగా తీసే నాథులు లేరు.. డ్రైనేజీ వ్యవస్థ అంతా అస్తవ్యస్థం.. రోడ్లు మురుగు కాలువల్లాగా తయారైన పరిస్థితి, కార్పొరేషన్ పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు పడే అవస్థలు కోకొల్లలు. ఎటుచూసినా కుప్పలు తెప్పలుగా పెరిగిన దోమల బెడద, అధ్వాన్నంగా పారిశుద్ధ్యం, పడకేసిన ప్రజారోగ్యం, వెలగని వీధిలైట్లు.. అనేక ప్రాంతాల్లో మంచినీటి కోసం ఇబ్బందులు.. ఇలా చెప్పుకుంటూపోతే నగరవాసుల సమస్యలు అన్నిన్ని కావు. అయితే, ప్రజల సమస్యలు గాలికొదిలేసి వివాదాలతో నాయకులు కాలక్షేపం చేస్తుండడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### నిబద్ధతగల ఉన్నతాధికారి రావాలి :

ఈ రాజకీయాలు ఎలా వున్నా, అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా నెల్లూరు నగరాన్ని సమస్యల వలయం నుంచి తప్పించి అభివృద్ధి బాట పట్టించేందుకు ఇదే మంచి సమయం. నగరంలో ఎంతోకాలంగా పేరుకునిపోయివున్న జటిలమైన సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా, అక్రమార్కుల భరతం పట్టి, ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేసే ధీటైన ఉన్నతాధికారి నియామకమే కార్పొరేషన్‌కు ఇప్పుడు అత్యవసరం.

రాష్ట్ర ముఖ్యమంత్రి, పురపాలక శాఖ మంత్రి తదితరులు ఇకనైనా ఎంతో ప్రతిష్టాత్మకమైన నెల్లూరు కార్పొరేషన్ దుస్థితిని పట్టించుకుని, రాజకీయాలకు అతీతంగా, ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసే సమర్థుడు.. అన్ని సమస్యలనూ ఒక కొలిక్కి తీసుకురాగల సత్తా వుండే.. ధీటైన ఐఎఎస్ అధికారిని కమిషనర్‌గా నియమిస్తే తప్ప ఈ కార్పొరేషన్ తీరు బాగుపడదనే అభిప్రాయాలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

# రచ్చ, రావిళ్ళు లేవు...

## చాన్నాళ్ళకు ప్రశాంతంగా జడ్పీ సమావేశం

ఎప్పుడు జిల్లా పరిషత్ సమావేశం జరిగినా రచ్చ, రావిళ్ళే! కానీ దానికి విరుద్ధంగా దాదాపు మూడున్నరేళ్ళ తర్వాత తొలిసారిగా బుధవారం జరిగిన జడ్పీ సమావేశం ప్రశాంతంగా సాగింది. అరుపులు, కేకలు లేవు, విమర్శలు, ప్రతి విమర్శలు లేవు. చాలామంది జడ్పీటీసీలు కొత్తగా ఎన్నికయ్యారు కాబట్టి వాళ్ళు ఇంకా రాటుతేల లేదు, గప్‌చిప్‌గా కూర్చున్నారు చెప్పింది విన్నారు. ఎమ్మెల్యేలు సైతం సుహృద్భావ వాతావరణంలో సహకారమందించారు.





బుధవారం నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన మొదటి జడ్పీ సర్వసభ్య సమావేశం జడ్పీఛైర్మెన్ బొమ్మిరెడ్డిరాఘవేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మెన్ మాట్లాడుతూ రాజకీయ పంతాలు, పట్టింపులు పక్కన పెట్టి ఐక్యంగా గ్రామ స్వరాజ్యం సాధించేందుకు పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు కలసి రావాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తొలుత జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జడ్పీ ఛైర్మెన్ అధ్యక్షతన 7స్థాయి సంఘాలకు ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్య, స్త్రీ సంక్షేమం, సాంఘిక సంక్షేమం, పనుల స్థాయి సంఘాలకు సంబంధించిన ఛైర్మెన్లు, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం ఎజెసి ఆర్‌ఎస్ రాజ్‌కుమార్, జడ్పీసిఇఓ జితేంద్ర, జడ్పీ వైస్‌ఛైర్మెన్ పి.శిరీష, కోవూరు, సర్వేపల్లి, గూడూరు, సుళ్ళూరుపేట, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కాకాణిగోవర్ధన్‌రెడ్డి, పాశం సునీల్‌కుమార్, సంజీవయ్య, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మెన్ ఎం.ధనుంజయరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.






Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com